

సోమశిలలో 32.587 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 25 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 32.587 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 20 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆ కాంట్రాక్టర్‌పై ఎంత ప్రేమో!


- ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లింపు
- కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకూ చుక్కలు చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

"మంగళగిరి అభివృద్ధికి సీఎం రూ.1,200 కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ రూ.125 కోట్లకు కుదిస్తూ జీవో ఇచ్చారు. నిధులు మాత్రం విడుదల కాలేదు. ధనుంజయరెడ్డితో చాలా సార్లు మాట్లాడినా డబ్బులు విడుదల కాలేదు. కాంట్రాక్టర్ల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. స్వయంగా నేనే అప్పులు తీసుకొచ్చి ఇచ్చాను. ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏం చేయాలి?"

- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవేదన

'రోడ్లు వేశాం. రోడ్డున పడ్డాం. వర్కులు చేసేందుకు ఆస్తులు అమ్ముకొని, అప్పులు తెచ్చాం. కానీ దీర్ఘకాలంగా బిల్లులు చెల్లించడం లేదు. ఇది చాలా దుర్మార్గం. మా కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. కొందరికే బిల్లులు చెల్లిస్తూ మిగిలిన వారిపై వివక్ష చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు"

- ఇటీవల విజయవాడలో చేసిన ఆందోళనలో కాంట్రాక్టర్ల ఆక్రోశం



- కానీ, ఆయనకు జాప్యం లేకుండా అప్‌లోడ్
- తేడా జరిగితే ఉన్నతాధికారులు లైన్‌లోకి..
- టెండర్లు కట్టబెట్టడంలోనూ అదే దూకుడు
- కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారిగా కాంట్రాక్టర్ బంధువు?
- ముఖ్యనేతకు అవసరం కాబట్టే పెద్దపీట

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : చేసిన పనులకు బిల్లులు తెచ్చుకోవడమంటే ఒక పెద్ద విజయమే సాధించినట్లుగా తయారయ్యాయి రాష్ట్రంలో పరిస్థితులు. సాధారణ కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకు కూడా చుక్కలు కనిపిస్తున్నాయి. ఆఖరుకు ఎంపీ, ఎమ్మెల్యే వంటి ప్రజాప్రతినిధులు కూడా తాము చేసిన పనులకు బిల్లులు విడుదల చేయించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల దుస్థితే దీనికి నిదర్శనం. అయితే ఒక కాంట్రాక్టర్‌కు మాత్రం ఇటు బిల్లు అప్‌లోడ్ చేయడం.. అటు విడుదల చేయడం జరిగిపోతోంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సుమారు రూ.300 కోట్ల వర్కులు చేస్తున్న ఈ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న బిల్లులను చూసి.... మిగిలిన కాంట్రాక్టర్లు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈయన కన్నా ముందు చేసిన వర్కులకు మాత్రం రూపాయి కూడా బిల్లు విడుదల కాలేదు. ఆఖరుకు సోమశిల ఆఫ్రాన్ పనులు అత్యవసరంగా చేపట్టాలని హైపవర్ కమిటీ సూచించినా, ఆ పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో ఉన్న పెద్ద కాంట్రాక్టర్లకు కూడా సాధ్యం కాని పని హైదరాబాద్‌కు చెందిన ఆ కాంట్రాక్టర్‌కు ఎలా సాధ్యమవుతోందని మిగిలిన కాంట్రాక్టర్లు ఆరా తీయగా అసలు గుట్టు బయటపడింది. సదరు కాంట్రాక్టర్ బంధువు ఓ కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తున్నారని సమాచారం. దీంతో ఆ కాంట్రాక్టర్ అవసరం ముఖ్య నేతకు ఎంతో ఉంది. ముఖ్య నేతకు సంబంధించిన కొన్ని కేసులను దర్యాప్తు చేస్తున్న ఆ కేంద్ర దర్యాప్తు సంస్థలో సదరు కాంట్రాక్టర్ బంధువు అధికారిగా ఉండడంతోనే హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు పెద్దపీట దక్కుతోందని చెప్పుకొంటున్నారు. కేంద్ర అధికారి ప్రాపకం కోసం ఈ కాంట్రాక్టర్‌ను మచ్చిక చేసుకొని ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాలు చర్చించుకుంటున్నాయి. నెల్లూరులో రూ.42 కోట్లతో ఓ కాలువ ఆధునికీకరణ పనులు జరగ్గా ఇప్పటికి రూ.37 కోట్ల బిల్లులు సదరు కాంట్రాక్టరుకు చెల్లించారు. చివరి రెండు బిల్లులకుగాను మరో రూ.5 కోట్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. అయితే ఇదే కాలువకు కొనసాగింపుగా ఉన్న మరో కాలువ పనులు రూ.5 కోట్లతో ఎప్పుడో పూర్తి చేసినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. అలానే ఈ కాంట్రాక్టర్ చేస్తున్న వర్కుల్లో ఇంకో కాలువ పనులు రూ.7 కోట్లు జరగ్గా అందులో రూ.4 కోట్లు ఇప్పటికే ఇచ్చేశారు. చివరగా పెట్టిన మరో బిల్లు రావాల్సి ఉంది. అయితే ఇదే కాలువ రెండో ఫేజ్ వర్కులను వేరే కాంట్రాక్టర్ ముందే చేసి బిల్లు పెట్టినా అది విడుదల కాలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులను కూడా ఆలస్యం లేకుండా అప్‌లోడ్ చేసేస్తున్నారు. ఏమాత్రం ఆలస్యమైనా రాష్ట్ర ఉన్నతాధికారులు లైన్లోకి వస్తారని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు.

బంధం బలమైనదే!

కాలువ ఆధునికీకరణ కోసం తొలుత రూ.89 కోట్లతో 2019 డిసెంబరులో టెండర్లు పిలిచారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు బిడ్‌లు దాఖలు చేశారు. అందులో సదరు కాంట్రాక్టర్‌కే వర్కు దక్కేలా మిగిలిన నలుగురు కాంట్రాక్టర్లపై ప్రభుత్వ స్థాయిలో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో ఆ నలుగురిలో ఒక్క కాంట్రాక్టర్ కూడా రివర్స్ టెండరింగ్‌లో పోటీపడలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు టెండరు దక్కింది. ఆ తర్వాత ఈ వర్కును రూ.89 కోట్ల నుంచి 110 కోట్లకు అంచనాలు పెంచినట్లు తెలిసింది. కానీ ఈ విషయాలను బయటపెట్టేందుకు అధికారులు భయపడిపోతున్నారు. కాగా వరద ముంపు రక్షణకై మట్టి కట్ట నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కానీ ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు కాకుండా మరో కాంట్రాక్టర్‌కు ఈ వర్కు దక్కింది. దీంతో ఏకంగా ఈ టెండర్‌నే రద్దు చేశారు. ఈ దఫా మట్టి కట్ట కాదు కాంక్రీట్ వాల్ అంటూ మళ్లీ టెండర్ పిలిచారు. ఈసారి ఎలాగైనా ఆ కాంట్రాక్టర్‌కే టెండర్ దక్కేలా ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. మొదట దఫా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ దఫా పోటీలో లేకుండా ఏకంగా ఓ ప్రజాప్రతినిధి బెదిరింపులకు దిగారు. దీంతో కాంట్రాక్టర్ ఆ ప్రజాప్రతినిధిపై కేసు కూడా పెట్టారు. ఎన్ని జరిగినా చివరకు అనుకున్న విధంగా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా చేశారు. అయితే ఇప్పుడు ఆ వర్కును మళ్లీ డిజైన్ మార్చారు. దీంతో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇదే విధంగా మరో కాలువ ఆధునికీకరణకై సుమారు రూ.40 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. ఇక్కడ కూడా మరో కాంట్రాక్టర్ పోటీకి రాకుండా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్‌కు ముఖ్యనేతతో ఉన్న బంధం బలాన్ని తెలిపే ఇలాంటి ఉదంతాలెన్నో నెల్లూరు జిల్లాలో వినిపిస్తున్నాయి.



నిరవధిక ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీల నిరవధిక ధర్నా

- కలెక్టరేట్ ఎదుట 24 గంటలు కొనసాగింపు

నెల్లూరు (వైద్యం) జనవరి 6 : డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. సమ్మె ఆరంభించి 26 రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శనివారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట 24 గంటల నిరవధిక ధర్నా చేపట్టారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తరలివచ్చి ఈ ధర్నాలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనాబేగం మాట్లాడారు. నా అక్కా చెల్లెళ్లు అంటూ సంబోధిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమ్మెపై ఉక్కుపాదం మోపేలా నోటీసులు జారీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని విధాలుగా ఒత్తిడికి గురిచేసినా సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు అంగన్‌వాడీలకు ఇస్తానన్న జగన్ హామీ ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి ఇలాగే కొనసాగితే అన్ని సంఘాలను కలుపుకుని ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా, కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ, హారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా' ఎత్తివేయాలి!

నెల్లూరు (సాంస్కృతికం) : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం తక్షణం రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్లంకి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్టపరంగా తమకు రావాల్సిన హక్కులు, ఉద్యోగ భద్రత గురించి శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఉక్కుపాదం మోపడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

ఎస్మా ప్రయోగం దురదృష్టకరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దురదృష్టకరమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపి, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి సమస్యలపై ప్రత్యేక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి తదితర నేతలు ఆయన వెంట ఉన్నారు.

అదనపు ఎస్పీగా సౌజన్య



నెల్లూరు (క్రైం), జనవరి 6: జిల్లా అదనపు ఎస్పీగా సీహెచ్ సౌజన్య శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాజమహేంద్రవరం నుంచి నెల్లూరు ఏఎస్పీగా ఆమె బదిలీపై వచ్చారు. 2012 బ్యాచ్ డీఎస్పీగా ఎంపికైన సౌజన్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేవెళ్ళ, వికారాబాద్, తెనాలి, గుంటూరు క్రైమ్స్, ఇంటలిజెన్స్ డీఎస్పీగా పని చేశారు. రాజమహేంద్రవరంలో ఏసీబీ డీఎస్పీగా ఉన్న ఆమె 2021లో ఏఎస్పీగా పదోన్నతి లభించింది. గత నెల 15వ తేదీన సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు ఏఎస్పీగా ఇక్కడకు బదిలీ అయ్యారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ సౌజన్యను ఎస్‌బీ, డీపీవో, డీసీఆర్బీ, ఏఆర్, హోంగార్డ్స్, సీసీఎస్, సైబర్ టీమ్, ఐటీ కోర్‌టీం తదితర విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

11న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

నెల్లూరు (విద్య): నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 11వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-సాంఘిక న్యాయం అనే అంశంపై జిల్లాస్థాయి వ్యాస రచన పోటీలు నిర్వ హిస్తున్నట్లు డీఈఓ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. విజ యవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 12 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు ఉదయం 10 గంటలకు, 16 నుంచి 18 ఏళ్ల విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజే తలకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ స్థానంకు రూ.75వేలు, తృతీయ స్థానంకు రూ.50 వేలు అందచేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొ నదలచిన విద్యార్థులు ముందు గానే రిజిస్ట్రేషన్ చేసు కుని ఆధార్‌కార్డుతో పోటీలకు హాజరు కావాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం డీఈఓ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ డీఈఓ నెల్లూరు50వెబ్స్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9381112743, 9494754535 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

> ఇదిగో.. అక్కడ రెండో వీధిలో పెద్ద బిల్డింగ్ కట్టారు... అది మనోళ్లదే.. పన్ను నామమాత్రంగా వేయ్..! మిగతాది నేను చూసుకుంటా. నువ్వు అక్కడికి వెళ్లి కొలతలేసుకుని వచ్చేయ్.. వాళ్లతో ఏమీ మాట్లాడొద్దు. ఎక్కడైనా తేడా చేశావో బాగోదు. ఫైల్ పంపేటప్పుడు ఫోన్ చేయ్.. పన్ను ఎంతన్నది నేను చెప్తా..!
>
> - ఇది ఓ సచివాలయ అడ్మిన్‌పై స్థానిక కార్పొరేటర్ హుకుం.


> చూడు... వాడెవడో నన్ను కలవకుండానే షాపింగ్ కాంప్లెక్స్ కట్టేస్తున్నాడు. కార్పొరేషన్‌లో వాడు తీసుకున్న ప్లానింగ్ అనుమతులేంటి.. చూడు. ఎలాగైనా డివియేషన్ గుర్తించి నాకు చెప్పు. ఏం చేయాలో ఆ తరువాత చెప్తా. నిర్మాణంపై నువ్వు నోటీసులు ఇవ్వు. నన్ను కలవమని వాడితో చెప్పు. మిగతాది నేను చూసుకుంటా.
>
> - మాట వినని బిల్డర్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు మరో కార్పొరేటర్ తీరిది.

మా ఆఫీసులో మీ.. పెత్తనం ఏమిటి..?

- సచివాలయాల్లో పెచ్చుమీరుతున్న కార్పొరేటర్ల జోక్యం
- అడ్మిన్, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులకు వేధింపులు
- కొళాయిలు వేయాలంటూ అమినిటీస్ అధికారులకు ఆదేశం
- అనర్హతలున్నా పథకాల్లో చేర్చాలంటూ ఎడ్యుకేషన్ సెక్రటరీలపై ఒత్తిడి
- ట్రేడ్ లైసెన్సుల పేరిట దుకాణాలకు నోటీసులు.. ఆపై దండకాలు!

నెల్లూరు(సిటీ), జనవరి 6

ఇలా.. నెల్లూరులో కొందరు కార్పొరేటర్లు సచివాలయాల్లో కార్యదర్శులపై మితిమీరిన పెత్తనం చెలాయిస్తున్నారు. తమ డివిజన్లలో జరుగుతున్న కట్టడాల నుంచి మామూళ్లు వసూళ్లకు సిటీ ప్లానింగ్ సెక్రటరీలను వాడేస్తున్నారు. వారితో ఉల్లంఘనలను గుర్తించి తొలుత నోటీసులు జారీ చేయించి ఆపై వారిని కలిసిన బిల్డర్లతో దండకాలు మొదలుపెడుతున్నారు. ఈ తంతు అటు సిటీ, ఇటు రూరల్ నియోజకవర్గాల్లోని డివిజన్లలో అత్యధికంగా జరుగుతోంది. ఇకపోతే నిర్మాణాలు పూర్తయిన భవనాలకు పన్ను ఎంత వేయాలన్నది కూడా స్థానికంగా ఉండే కార్పొరేటర్లే నిర్ణయిస్తున్నారు. ఈ బాధ్యతలను సచివాలయాల్లో పర్యవేక్షించే అడ్మిన్లపై పెత్తనం చెలాయిస్తూ తమ సూచనలు మేరకే పన్నులు వేయాలని స్పష్టం చేస్తున్నారు. ఈ తంతుకు ముందు భవన యజమానులతో కుమ్మక్కై పన్ను విధింపుల్లో ముడుపులు వసూళ్లు చేస్తున్నారు. డివిజన్లలో కొత్తగా ఎవరైన తాగునీటి కుళాయి వేయాలన్నా కార్పొరేటర్లే తుది నిర్ణయం గా మారింది. కార్పొరేషన్‌లో చలానాలు కట్టే పద్ధతికి పూర్తిగా విరామం ఇచ్చేసిన కార్పొరేటర్లు వీళ్లే ఆ మొత్తా న్ని దండుకుని అమినిటీస్ సెక్రటరీలతో కుళాయి కనెక్షన్లను వేయించేస్తున్నారు.



సెక్రటరీలపై కార్పొరేటర్ల వేధింపులు

నెల్లూరు నుంచి జొన్నవాడ వెళ్లే మార్గంలో శివారున ఉన్న ఓ డివిజన్‌లో కార్పొరేటర్ భర్త పోలీసు కానిస్టేబుల్ కావడంతో ఇక సచివాలయ ఉద్యోగులపై వేధింపుల పర్వానికి తెరలేపాడంటూ ఆ ప్రాంత ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయం నుంచి జరిగే ప్రతి సేవ తన అనుమతితో జరగాలంటూ హుకుం జారీ చేశాడంటూ ఆరోపణలున్నాయి. మాగుంట లేఅవుట్ ప్రాంతంలోని మరో కార్పొరేటర్ ఏకంగా సచివాలయంలోనే తిష్ట వేసి ఏ ఉద్యోగి ఏం చేయాలన్నది తాను నిర్ణయిస్తానంటూ ఆదేశాలు జారీ చేస్తూ, తనకు తెలియకుండా ఏం జరగకూడదంటూ పెత్తనం చెలాయిస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. నెల్లూరు- ముత్తుకూరు రహదారిలో రూరల్ ప్రాంతంలోని మరొక సచివాలయంలో కార్పొరేటర్ వేధింపులు తట్టుకోలేక ఉమెన్ ప్రొడక్షన్, ఎడ్యుకేషన్, అమినిటీస్ సెక్రటరీలు సుదీర్ఘ సెలవుల్లోకి వెళ్లగా అడ్మిన్ బదిలీకి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాగా తన మాట వినలేదన్న కారణంతో ఓ మహిళా వలంటీరును తీసేసి మరో మహిళా వలంటీరుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నగర నడిబొడ్డున మరో కార్పొరేటర్ భర్త తనకు వ్యతిరేకుల నివాసాల వద్ద చెత్తను కూడా తీయ్యనివ్వకుండా పారిశుధ్య సిబ్బందిపై పెత్తనం చెలా యించడం చర్చనీయాంశంగా మారింది. ఇలా కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తల వేధింపులతో సచివాలయాల సిబ్బంది తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.

ట్రేడ్ లైసెన్సుల పేరిట దండకాలు

డివిజన్లలో రహదారులు, వీధులు, కూడళ్లు, విద్యా సంస్థలు, షాపింగ్ కంప్లెక్స్‌ల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారి నుంచి స్థానిక కార్పొరేటర్లు ఆర్థిక దందాలకు పాల్పడుతున్నారు. దేవాలయాల వద్ద ఉన్న బొంకుల నుంచి మొక్కల విక్రయదారులు, దేవుడు విగ్రహాల తయారీదారులు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు వరకు డబ్బులు దండుకునే పనిపెట్టుకున్నారు. ఈ క్రతువుకు ముందు శానిటేషన్ సెక్రటరీలను రంగంలోకి దింపి ట్రేడ్ లైసెన్సులు కట్టాలంటూ వత్తిడి తీసుకువచ్చి ఆపై రంగంలోకి దిగి ఆర్థిక దండకాలకు తెర లేపుతు న్నారు. కాగా తమకు అనుకూలస్తులు, ఓటు బ్యాంకు ఉన్న వారు అనర్హులైనప్పటికీ ప్రభుత్వ పథకాల్లో అర్హత కల్పించాలంటూ సచివాలయాల్లోని ఎడ్యు కేషన్ సెక్రటరీలపై ఒత్తిడి ఎక్కువగా పెడుతు న్నట్లు తెలుస్తోంది. కొన్ని సచివాలయాల్లో ఈ తర హా ఒత్తిడిని తట్టుకోలేక ఎడ్యుకేషన్ సెక్రటరీలు బదిలీ లపై వెళ్లగా మరికొందరు సుదీర్ఘ సెలవుల్లోకి వెళ్లారు.

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలే వసూలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 6: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పండుగ రోజుల్లో జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నా మని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 102, బెంగళూరు నుంచి జిల్లాలోని ముఖ్య కేంద్రా లకు 30, చెన్నై నుంచి నెల్లూరుకు 12, కర్నూలు నుంచి నెల్లూరుకు 6 ప్రత్యేక బస్సులు నడుపుతు న్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి తగినన్ని బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీ మాత్రమే వసూలు చేస్తామని, ముందస్తు రిజర్వేషన్ సదుపాయ ము ఉందని తెలిపారు. రాను పోనూ కలిపి రిజ ర్వేషన్ చేసుకొన్న వారికి 10 శాతం రాయితీ ఇస్తు న్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జగన్‌కా దిల్ బదలావో... యా అల్లా!

- బారాషహీద్ దర్గాలో మున్సిపల్ కార్మికులు ప్రార్థనలు
- కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

నెల్లూరు (సిటీ), జనవరి 6 : తమ సమస్యల పరిష్కారం కోసం నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో పారిశుధ్య కార్మికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా లోపల సమాధుల వద్ద 'జగన్‌కా దిల్ బదలావో యా అల్లా (జగన్ మనసు మార్చు దేవుడా)' అంటూ వేడుకున్నారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి నగరపాలక సంస్థ కార్యాలయం ముఖద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు కార్పొరేషన్‌లోని కంప్యూటర్ ఆపరేటర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయాలని చూస్తే అందుకు పదింతలు ఎగసి పోరాడుతామని స్పష్టం చేశారు. తమ సమ్మె 12వ రోజుకు చేరినా ఉద్యమకారుల్లో ఏమాత్రం ఉత్సాహం తగ్గలేదని, ప్రభుత్వ దిగివచ్చే వరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఇచ్చిన మాటను నిలపెట్టుకోవడానికి కూడా సీఎం జగన్ సిద్ధంగా లేకపోతే ఎలా..? అంటూ ప్రశ్నించారు. ఈ ఆందోళనలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, కన్నెర కుమార్, అల్లాడిగోపాల్, నరసింహులు పాల్గొన్నారు. కాగా, కందుకూరులో పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేయగా, ఆత్మకూరు మున్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా, కావలిలో సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మికులు వేర్వేరుగా ఆందోళన చేశారు.



కందుకూరులో భిక్షాటన చేస్తున్న కార్మికులు



నెల్లూరు : బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కార్మికులు

కాలువతో జర భద్రం..

● అసంపూర్తిగా ఉత్తర కాలువ పనులు ● మృత్యువాత పడుతున్న మూగజీవాలు


నీటిప్రవాహంలో పడిన గేదె (ఫైల్)

అనంతసాగరం, జనవరి 6: సోమశిల ఉత్తర కాలువ ఆధునీకరణ నిరంతర ప్రక్రియగా మారింది. కాలువ సామర్థ్యం పెంచేలా చేపడుతున్న పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదభరితంగా మారింది. సోమశిల నుంచి కందుకూరు నియోజకవర్గం లోని రాళ్లపాడు వరకు కాలువ విస్తరించి ఉంది. అయితే కొన్నిచోట్ల కాలువ భూమట్టానికి సమాంతరంగా ఉండడంతో కాలువలో నీటి ప్రవాహం కొనసాగే సమయంలో మూగజీవాలు అందులో పడి ప్రమాదానికి గురవుతున్నాయి. అనంత సాగరం మండలంలోని గోవిందమ్మపల్లి, చిలకలమర్రి, మంగుపల్లి, చిరువెళ్లకో పాటు మర్రిపాడు మండలంలో కాలువ వెంబడి గ్రామాల్లో పశువులు మేపుటకు పంటకు నీరు ఇచ్చే సమయంలో నీటి ప్రవాహంలో పడి మృత్యువాత పడుతున్న ప్రమాదంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. చిలకలమర్రి సమీపంలో గత ఏడాది రబీ సీజన్‌లో 750 క్యూసెక్కుల ప్రవాహం కాలువలో కొనసాగే సమయంలో రెండు గేదెలు పడి మృతిచెందాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల సమీపంలో పశువులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కౌలు రైతు దుర్మరణం

● మహిళకు గాయాలు


లారీ చక్రాల కింద రమయ్య మృతదేహం


గాయపడిన సుశీల

మనుబోలు, జనవరి 6: రోడ్డు ప్రమాదంలో ఓ కౌలు రైతు మృతిచెందగా, మహిళకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కృష్ణపట్నం పోర్టు క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరివారిపాళెం దళితవాడకు చెందిన కౌలు రైతు మరుగొండ్ల రామయ్య (41), వద్దయ్యల కలిసి మనుబోలు మండలం వడ్లపూడి పరిధిలో వరిసాగు చేసుకునేందుకు వరికోతలు కౌలుకు తీసుకున్నారు. నిత్యం రామయ్య మోటార్‌సైకిల్‌పై గ్రామం నుంచి వడ్లపూడికి వెళ్లి వ్యవసాయ పనులు చూసుకుని వస్తుంటాడు. రోజులాగానే శనివారం 6గంటల సమయంలో బయలుదేరగా మధ్యలో చల్లా సుశీల అనే మహిళ తనను పోర్టురోడ్డు దగ్గర దింపాలని రామయ్యను అడిగింది. దీంతో ఆమెను మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని వస్తూ పోర్టు రోడ్డులో మరమ్మతులు చేస్తుండడంతో రామయ్య సర్వీసు రోడ్డుకు వచ్చాడు. అక్కడ నుంచి పోర్టు క్రాస్‌రోడ్డుకు రాకుండా అక్కడే రోడ్డు దాటేందుకు ప్రయత్నించడంతో నెల్లూరు నుంచి చెన్నైకు వెళుతున్న లారీ వేగంగా వచ్చి మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో వెనుక ఉన్న మహిళ పక్కన పడిపోగా లారీ చక్రాల కింద పడి రామయ్య దుర్మరణం చెందాడు. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాదాస్పదంగా ఉపాధి పనులపై విచారణ


ఉపాధి హామీ పనులపై విచారణ చేపడుతున్న ఏపీడీ మృదుల

విడవలూరు, జనవరి 6: మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఏపీడీ మృదుల శనివారం చేపట్టిన విచారణ వివాదాస్పదంగా మారింది. విచారణలో ఆమెకు సంబంధించిన సొంత మనుషుల రికార్డులు సక్రమంగా సమర్పించకపోయినా పట్టించుకోని ఏపీడీ, రికార్డులు సక్రమంగా ఉన్న కొందరు ఫీల్డ్ అసిస్టెంట్ల రికార్డులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దంపూరులో ఫీల్డ్ అసిస్టెంట్‌గా భార్య పేరు ఉండగా, ఆమె భర్త పెత్తనం చేయడాన్ని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పుబట్టారు. ఈ విషయం ఏపీడీకి తెలిసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని తమపై దురుద్దేశపూర్వకంగా తాము సమర్పించిన రికార్డులను తిరస్కరించారని వారు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి ఏపీడీ పక్షపాతంపై విచారణ జరపాలని కోరారు.

ఫోన్‌పే చేస్తానని నగదుతో యువకుడు పరార్

పొదలకూరు, జనవరి 6: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ముందు ఓ యువకుడు తనకు ఫోన్‌పే చేయాలని నగదు చేతికిస్తానంటూ మరొక వ్యక్తిని బురిడీ కొట్టించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పొదలకూరులోని యాదవ వీధికి చెందిన మాలపాటి మధుసూదన్‌రెడ్డి శనివారం బ్యాంక్ ఏటీఎం వద్దకు రాగా ఓ యువకుడు మధుసూదన్‌రెడ్డితో అన్నా.. నేను మీకు ఫోన్ పే చేస్తాను.. నాకు రూ.8వేలు నగదు ఇవ్వాలని అడిగి ఫోన్‌పే చేయడానికి ఫోన్ నెంబరు చెప్పించుకుని నగదు వచ్చాయి.. చూడండంటూ చెప్పాడు. దీంతో మధుసూదన్‌రెడ్డి ఫోన్ చూసేలోపే నగదుతో అక్కడ నుంచి ఆ యువకుడు బైక్‌పై పరారయ్యాడు. ఫోన్‌పేలో నగదు కూడా పడలేదు. దీనిపై మోసపోయానని గ్రహించిన మధుసూదన్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, బ్యాంకు మేనేజర్‌కి ఫిర్యాదు చేశారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు గైర్హాజరు

వెంకటాచలం, జనవరి 6: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 27 మంది విద్యార్థులకుగాను 21 మంది హాజరయ్యారు.

అక్రమంగా తెల్లరాయి తవ్వుతున్న

రెండు జేసీబీలు, రెండు ట్రాక్టర్ల స్వాధీనం

సైదాపురం, జనవరి 6: మండల కేంద్రం రిజర్వ్ ఫారెస్టు భూముల్లో అక్రమంగా జరుపుతున్న తెల్లరాయి తవ్వకాలపై శుక్రవారం తెల్లవారుజామున ఫారెస్టు అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రేంజర్ మాల్యాద్రి మాట్లాడుతూ డీఎఫ్‌ఓ ఆవుల చంద్రశేఖర్ ఆదేశాల మేరకు సైదాపురం ఫారెస్టు భూముల్లో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తున్న రెండు జేసీబీలు, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి ఆమీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోని చెట్లపొదల్లో మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 6: నగరంలోని లేక్‌వ్యూకాలనీ సమీపంలోని నెల్లూరు చెరువులోని చెట్లపొదల్లో శనివారం ఓ వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎస్‌ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికితీశారు. ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాగా కపాడిపాలెంకు చెందిన ఓ మహిళ బారాషహీద్ దర్గ వద్ద ఉంటున్న తన తండ్రి మూడు రోజులుగా కనిపించడం లేదని దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేసి ఉన్నారు. దీంతో పోలీసులు ఆమెను మార్చురీకి తీసుకెళ్లి వృద్ధుడి మృతదేహం చూపించారు. మృతుడు తన తండ్రి పి.అల్లాభక్షు(60) అని ఆమె నిర్ధారించింది. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డుకు చెందిన అల్లాభక్షుకు భార్య, పిల్లలున్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో ఆయన నాలుగేళ్లుగా బారాషహీద్ దర్గాలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారా లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అన్న వివరాలు విచారణలో తెలాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	90
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5982
వెండి కిలో ధర	రూ. 74,000
వెండి ఒక గ్రాము	రూ. 76.00

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల విజేత

'ప్రొద్దుటూరు'

● కోడూరుపాడులో ముగిసిన పోటీలు


పోటీలలో తలపడుతున్న ఎడ్ల జత


తొలి విజేతకు నగదు బహుమతి అందచేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు రూరల్, జనవరి 6: నెల్లూరు రూరల్‌లోని కోడూరుపాడులో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన ఎంకేవీ ఎడ్ల జత విజేతగా నిలిచింది. రెండో, మూడు స్థానాల్లోనూ కడప జిల్లా ఎడ్లు కైవసం చేసుకున్నాయి. వివరాల మేరకు.. కోడూరుపాడులో వెలసియున్న ఊటమ్మ మహాకుంభాభిషేకం ఉత్సవాల సందర్భంగా ఒక్కరోజు నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 25 జతల ఎడ్ల యజమానులు పాల్గొన్నారు. 1600 కేజీల బండను 15 నిముషాల వ్యవధిలో ఏ ఎడ్ల జత ఎక్కువ దూరం లాగుతుందో ఆదే విజేతగా నిలుస్తోంది. ఈ పోటీలో కేవీ ఎడ్ల జత నిర్ణీత సమయానికి 2,280 అడుగులు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే కడపకు చెందిన కర్నాటి విశ్వనాథ రెడ్డి ఎడ్లు 2,060 అడుగులు లాగి రెండవ స్థానం, అదే జిల్లాకు చెందిన భావన్‌శ్రీ ఎడ్ల జత 2,040 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. పోటీలను విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోమరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పర మేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్ ప్రారంభించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరురూరల్, జనవరి 6: చెన్నై-కోలకత్తా జాతీయ రహదారి కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డుకు సమీపంలో ఈనెల 5న తేదీన సర్వేపల్లి కాలువలో పడి గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు తిరుపతి జిల్లా కోటకు చెందిన ప్రసన్నకుమార్ (40)గా గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చెల్లి కోసం వెళుతూ... రోడ్డుపైనే కన్నీటిపర్యంతమైన బంధువులు, స్నేహితులు

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడు దుర్మరణం

మనుబోలు, జనవరి 6: మనుబోలు-పొదలకూరు మార్గంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ మండల ధ్యక్షుడు ఓడూరు శ్రీనువాసులు రెడ్డి (43) దుర్మరణం పాలయ్యాడు. స్థానిక కోదండరామపురంకు చెందిన శ్రీనువాసులు రెడ్డి రెండేళ్లుగా బీజేపీ మండలాధ్యక్షుడుగా పనిచేస్తున్నాడు. తన ఇద్దరు పిల్లలు, బంధువులతో కలిసి శబరిమల యాత్ర ముగించుకుని శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. గొలగమూడికి వెళ్లి వెంకయ్యస్వామిని దర్శించుకుని ఇంటికి వచ్చాడు. శబరిమల నుంచి తెచ్చిన ప్రసాదాలు, చీర తీసుకెళ్లి మిట్టాత్మకూరులో ఉన్న తన చెల్లికి ఇవ్వాలని ఇంటినుంచి సాయంత్రం మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో మడమనూరు జగనన్న లేఅవుట్ వద్ద భారీ గుంతలో మోటార్‌సైకిల్ దిగడంతో అదుపుతప్పి బోల్తా పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్ ప్రమాద స్థలికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీను మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదస్థలి వద్ద బంధువులు, స్నేహితులు బోరున విలపించసాగారు.



రోడ్డుపై భారీ గోతులతో ప్రమాదాలు

మనుబోలు- పొదలకూరు మార్గంలో మలుపుల వద్ద నాలుగు చోట్ల భారీ గోతులు ఉన్నాయి. ఇవి రోడ్డు మధ్యలో ఉండడంతో రాత్రి వేళలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదానికి కారణమైన గుంత నుంచి పది మీటర్ల దూరం తరువాత మోటార్ సైకిల్ పడి, తలపగిలి చనిపోయి ఉండడంపై సందేహాలు కలుగుతున్నాయి. మోటార్ సైకిలును ఏదైనా వాహనం ఢీకొట్టడంతో అదుపుతప్పి జరిగిందా అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించాలి


నిరసన దీక్షలో షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు

కోవూరు, జనవరి6: పదేళ్లుగా బకాయిల కోసం ఎదురు చూస్తున్నా మని కోవూరు సహకార చక్కెర కర్మాగారం ఉద్యోగులు పేర్కొన్నారు. శనివారం ఫ్యాక్టరీ ఆవరణలో నిరసన దీక్ష చేపట్టారు. జీతాల బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో తమకు చెల్లించాల్సిన బకాయిల్ని వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక విస్మరించారని వాపోయారు. నిరసన దీక్షలో నాగిరెడ్డి వెంకయ్య, ఆముదాల ఖాన్, రామయ్య, గోరా బహదూర్, శ్రీరాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిగా మధుమతి


అభినందనలు తెలుపుతున్న వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం, జనవరి 6: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ నూతన పరీక్షల నిర్వహణాధికారిగా డాక్టర్ ఆర్ మధుమతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీసీ సుందరవల్లి ఆదేశాల మేరకు ఆమె బాధ్యతలు తీసుకున్నారు. అలాగే డాక్టర్ కేవీఎల్ శ్రీనివాసరావు, ఏ శివకుమార్‌రెడ్డిలు అడిషనల్ కంట్రోలర్లుగా బాధ్యతలు స్వీకరించారు. వీరికి వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానందకుమార్‌బాబు అభినందనలు తెలిపారు.

యూరియా కోసం రైతుల పాట్లు

తోటపల్లిగూడూరు: మండలంలోని రైతులు కాంప్లెక్స్ ఎరువులతో యూరియా అం దక నానా ఆగచాట్లు పడుతున్నారు. అధికారులు మాత్రం రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నా ఆ కేంద్రాలలో కాంప్లెక్స్ ఎరువులు డీఏపీ, 20-20-13 మాత్రమే ఉన్నాయి. మిగతా ఎరువుల దగ్గరలో ఉన్న సొసైటీలకి వెళ్లి తెచ్చు కుంటున్నారు. గత మూడు రోజుల నుంచి యూరియాకు డిమాండ్ పెరగడంతో రైతులు, ప్రైవేటు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎంఎస్‌పీ, ఎంఎంఎస్ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

నెల్లూరు (హర నాథపురం), జనవరి 6: మాదిగ విద్యార్థుల జాతీయ సదస్సుకు అనుమతి నిరాకరించిన నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్, ఎంఎంఎస్ నాయకులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు కోలగట్ల రమేష్‌మాదిగ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అనుబంధ విద్యార్థి సంఘాలకు అనుమతి ఇచ్చినప్పుడు 30 ఏళ్లుగా శాంతియుతంగా సుదీర్ఘ పోరాటం చేస్తున్న మాదిగ విద్యార్థుల సదస్సుకు అనుమతి ఎందుకివ్వరని ప్రశ్నించారు. ఈ సదస్సుకు అనుమతి ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మహాజన సోషలిస్టు పార్టీ తమిళనాడు రాష్ట్ర ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ అరసనపల్లి వేణు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి చేవూరి శేరదరమాదిగ, ఎంఎస్‌పీ ప్రధాన కార్యదర్శి శేషయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ మూలిపాక ఉదయ్‌మాదిగ, ప్రచార కార్యదర్శి ఏసుపోగు జయరాజుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

సరైన నష్టపరిహారం చెల్లించకుంటే


పొలిమేర కూడా తాకనివ్వం

● బాధిత రైతుల హెచ్చరిక


బాధిత రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌వో లవన్న

పొదలకూరు, జనవరి 6: ప్రభుత్వం భారతమాల పరియోజన కింద నాలుగు లైన్ల హైవే నిర్మాణంలో భాగంగా కలువాయి, చేజర్ల, పొదలకూరు మండలాల్లోని తమ భూములను తీసుకుంటోందని, సరైన నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు కాదు కదా పొలిమేర కూడా తాకనివ్వమని రైతులు హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు డీఆర్‌వో లవన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్, ఇతర అధికారులపై మండిపడ్డారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లాలోని మడకలవారిపల్లి గ్రామం నుంచి నెల్లూరు జిల్లాలోని గురువిందపూడి గ్రామం వరకు భారతమాల పరియోజన కింద నాలుగు లైన్ల హైవే అభివృద్ధి జరుగుతుందని, అధికారులు దీనికోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియను సత్వరంగా నిర్వహించాలన్నారు. అరకొర నష్టపరిహారానికి తాము వరికోటు భూములు కోసుగోలు చేయలేమని, రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి లవన్న మాట్లాడుతూ చట్టప్రకారం రైతులకు ఎంత ప్రయోజనం చేయగలమో అంతా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాయపురం, కావలాయి, నాగల వెల్లటూరు, కనుపూరుపల్లి, చిన్నగోపవరం, చిట్టలూరు, ఉదారుపల్లి, ఏటూరు, అర్జిపాలెం, మొగలూరు, కసవర్తి, గురవాయపాలెం, పొదలకూరు, పార్లపల్లి, బిరదవోలు, గ్రామాల రైతులు, నాలుగు మండలాల తహసీల్దారులు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం



రాపూరు (దక్శిలి): పెంచల కోన ఆలయంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నృసింహస్వామి కల్యాణం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కల్యాణం వీక్షించారు. అంతకు ముందు ఉదయం 4 గంటలకు ఆలయంలో తిరుప్పావసేవ మనంగా నిర్వహించారు. అనంతరం గోపూజ, బిందు తీర్థం, అభిషేకం, చందనాలంకరణ, పూలంగిసేవ, శాంతిహోమం, సాయంత్రం బంగారు గరుడ వాహన సేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనరు తగు ఏర్పాట్లు చేశారు.

హెచ్ఆర్ఏ పాలసీని అమలు చేయాలి


జేఏసీ నేతలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

నెల్లూరు(విద్య), జనవరి 6: హెచ్ఆర్ఏ పాలసీ అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని సమగ్ర శిక్ష కెజిబివిఎస్ ఉద్యోగులు స్పష్టం చేశారు. నగరంలోని కలెక్టరేట్ ఎదుట శనివారం నిర్వహించిన సమ్మెలో జేఏసీ నేతలు మాట్లాడారు. తమ సమస్యలపై గతకొన్ని రోజులుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఎస్‌పీడీ నేతలను చర్చలకు పిలిచి హెచ్ఆర్ పాలసీపై కమిటీ వేస్తామని, విద్యాశాఖ మంత్రితో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారన్నారు. అయితే తమకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చేవరకు సమ్మె విరమిస్తామని, రేపు మంత్రితో చర్చలకు వచ్చారని మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమ్మెకు మద్దతు ప్రకటించి తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ చైర్మన్ సతీష్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జేఏసీ నేతలు పాల్గొన్నారు.

2వ రోజూ కొనసాగిన

ఏసీబీ విచారణ

నెల్లూరు(సిటీ), జనవరి 6: నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ అధికారులపై వచ్చిన ఫిర్యాదులతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారుల బృందం శనివారం కూడా విచారణ చేపట్టారు. ఓ వ్యక్తి ద్వారా అందుకున్న ఫిర్యాదుతో ఆర్ఐ అబ్దుల్‌పై ఆరోపణలు వ్యక్తమవడంతో వారిని నెల్లూరులోని తమ కార్యాలయానికి పిలిచి ప్రాథమిక విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు ఫిర్యాదులో నెలకొన్న అంశాలపై రెండవ రోజు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ సీబీలోని చర్చి దగ్గరున్న వివాదాస్పద స్థలంలో తమకు అందిన ఫిర్యాదు మేరకు స్థానికుల నుంచి వివరాలు సేకరించినట్లు సమాచారం. అయితే ఆరు రెవెన్యూ ఇటు ఏసీబీ అధికారులు ఈ వ్యవహారాన్ని అత్యంత రహస్యంగా విచారణ చేపడుతున్నారు.

గుర్తుతెలియని వాహనం

ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 6: నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. జనార్దన్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న సులోచనమ్మ(68) శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో భగత్‌సింగ్‌కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా కావలి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో రోడ్డు పక్కన పడివున్న వృద్ధురాలిని గమనించిన స్థానికులు 108 సహాయంతో చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే ఆమె మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమార్తె సునీత ఫిర్యాదు మేరకు శనివారం నార్త్‌ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఎస్‌ఐ గీతాదేవమ్మలు మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలు అణచలేరు : సీఐటీయూ

కావలి, జనవరి 6: నిర్బంధాలతో ఉద్యమాలను అణగ దొక్కలేరని సీఐటీయూ నాయకుడు పసుపులేటి పెంచలయ్య తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం 26వ రోజు అంగన్‌వాడీలు సమ్మె చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా టెంట్‌లో కూర్చున్న అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐ టీయూ పట్టణ కార్యదర్శి వై. కృష్ణ మోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ. రఘురావమ్మ, సుభాషిణి, విజయలత, పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కావలి: ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఆత్మకూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శనివారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. సీఐటీయు నాయకులు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే న్యాయ పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె అజయ్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన 26వ రోజు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, మల్లికార్జున, రజియా, ప్రమీలా, రమాదేవి, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో ఉపసంహరించుకోవాలి

కందుకూరు: అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ జారీచేసిన జీవోను తక్షణం ఉప సంహరించుకోవాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి జి మోషే డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ఉద్యోగాల్లోంచి గెంటేయటం అమ్మను గెంటేసినంత ఈజీకాదన్న విషయాన్ని జగన్మోహన్‌రెడ్డి గుర్తించాలన్నారు. జీవోను ఉపసంహరించి న్యాయం చేయాలని మోషే డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

వలేటివారిపాలెం, జనవరి 6: అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీదర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం పింఛన్ల పంపిణీ జరిగింది.ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పీ మౌనిక, జడ్పీటీసీ ఈ భారతి, డీఎల్‌డీవో పద్మజ, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, తహసీల్దార్ సుదరమ్మ, ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, సర్పంచి డేగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

● భక్తులకు వసతుల కల్పనే ధ్యేయం

లక్ష్మీనరసింహుడి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతుల కల్పనే తమ ధ్యేయమని అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయనకు ఆయనకు అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు, ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

● వైభవంగా శ్రీరామచంద్రుడి ఉత్సవాలు

వలేటివారిపాలెం మండలంలోని కొండసముద్రం శ్రీరామచంద్రస్వామి ఆలయంలో శనివారం ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నూతన విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 46 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్థులు ఈ ఉత్సవాలు నిర్వహించారు. అర్చకులు శ్రీరామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి మన్నం వెంగమ్మలు, వెంకటరమేష్ పాల్గొన్నారు.

కందుకూరులో మున్సిపల్ కార్మికుల భిక్షాటన

కావలి, జనవరి 6 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు మున్సిపల్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు శిబిరంలో కూర్చుని ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దామా అంకయ్య, కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, సీఐటీయూ నాయకులు పీ. పెంచలయ్య, వై. కృష్ణమోహన్, కార్మిక యూనియన్ నాయకులు టీ శీనయ్య, బీ మహేష్ పాల్గొన్నారు.

కందుకూరు : జీతాలు పెంచాలని, ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం పట్టణంలో భిక్షాటన చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగిన రిలే దీక్షలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వాణిజ్య దుకాణాలకు వెళ్లి కార్మికులు భిక్షాటన చేసి నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నేత బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నేత వై. ఆనంద్‌మోహన్, సీఐటీయూ నాయకుడే ఎస్‌ఏ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రవణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, శేషమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.



కావలి : సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయు, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా టీడీపీ, సీపీఎం, సీఐటీయు నాయకులు నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సంగంలో జేసీ పర్యటన



రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జేసీ

సంగం, జనవరి 6: సంగంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి కూర్మనాథ్ పర్యటించారు. ముందుగా సంగంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సాయినగర్‌లోని రేషన్ ఎండియు వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ పంపిణీ తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంగాలకండ్రికలో రీసర్వే గ్రామసభలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి

వింజమూరు, జనవరి 6: పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యకర్తలందరూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నర్సారెడ్డి, చల్ల వెంకటేశ్వర్లు, ఖాజావలి, కొండపల్లి వెంకటేశ్వరనాయుడు, ఎరుకులనాయుడు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఉపాధి హామీ నిర్వహణలో మేట్లదే కీలకపాత్ర

ఉదయగిరి, జనవరి 6: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహణలో మేట్లదే కీలకపాత్ర అని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరికీ పని కల్పించాలని కోరారు. కనీస వేతనం గిట్టుబాటయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య కరసేవలకు సన్మానం



సన్మాన సభలో మాట్లాడుతున్న నాయకులు

వింజమూరు, జనవరి 6: పట్టణంలోని శివాలయంలో శనివారం అయోధ్య కరసేవలకు బీజేపీ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్ అధ్యక్షత వహించగా పార్టీ జిల్లా నాయకులు కాలం బుజ్జిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొని కరసేవలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు రఘురామిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎ రమణయ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు బ్రహ్మయ్య, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సంగం, జనవరి 6 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ జి దేవి సూచించారు. శనివారం ఆమె సంగంలోని బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగది, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినకుండా విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్న విషయం గమనించామన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం తినేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.



విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

మిస్టరీగా వృద్ధురాలి హత్య

● అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

కందుకూరు, జనవరి 6: చుట్టుగుంటలో దారుణహత్యకు గురైన మందలపు శేషమ్మ కేసు మిస్టరీగా మారింది. మూడురోజులుగా పోలీసులు అనుమానితులను విచారిస్తున్నా కీలక ఆధారం లభ్యం కాలేదని సమాచారం. అనుమానితులు తమకు ఎలాంటి సంబంధం లేదని సాక్ష్యాలతో నిరూపిస్తుండటంతో ఇప్పటికే పోలీసులు విచారించి పంపించేశారు. మరికొందరు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారినుంచి కూడా హత్యకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని కూడా రాబట్టలేదని తెలిసింది. కనీసం ఈ హత్య జరిగేందుకు ఏవైనా కారణాలు ఉండి ఉంటాయా అన్న కోణంలో కూడా సమాచారం రాకపోతుండటం, కుటుంబసభ్యులు కూడా ఎలాంటి క్లూ ఇవ్వలేని పరిస్థితిలో శేషమ్మ హత్యకేసు మిస్టరీగా మారింది.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

కందుకూరు, జనవరి 6: కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కనిగిరి వెళ్లిన వీరంతా వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉలవపాడు మండలం కృష్ణాపురం సర్పంచి మందాడి సుశీలమ్మ, వైసీపీ నాయకులు మందాడి హనుమంతరావు, మందాడి వెంకటేష్, మహేష్, వినోద్‌కుమార్, దేవండ్ల వెంకయ్య, వెంకటేశ్వర్లు, బందారు లక్ష్మయ్య, తిరుపతి వెంకయ్య, బొజ్జ చంద్ర, యనమల బాలయ్య, చల్లా వెంకటయ్య, కొల్లి గంగరాజు, ఉలవపాడుకు చెందిన దాసరి వెంకటరావు, పాలకీర్తి శ్రీనివాసులు, మద్దసాని నవీన్‌కృష్ణ యాదవ్, రావినూతల రాజా, గొత్తుల శ్రీనివాసులు, జి. ఏడుకొండలు, గుడ్లూరు మండలం చేవూరుకి చెందిన ఉప్పు వెంకటేష్, నక్కల వినోద్, దారకానిపాడుకు చెందిన చల్లా రత్తయ్య, కందుకూరు మండలం కోవూరుకి చెందిన కోవూరు శ్రీరాములు తదితరులు పార్టీలో చేరారు.



చంద్రబాబు, ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

లింగసముద్రం, జనవరి 6: ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కందుకూరు సబ్ కలెక్టర్ జీ విద్యాధరి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయా అని అడగ్గా, పెండింగ్‌లో లేవని తహసీల్దార్ చెప్పారు.రీ సర్వే గురించి కూడా ప్రశ్నించారు. కార్యాలయం ఆవరణలో నిర్మాణం పూర్తయిన డిజిటల్ లైబ్రరీని పరిశీలించారు.అంతకుముందు ఆమె వెంగళాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారా, లేదా, కేంద్రాలను ఎవరు నిర్వహిస్తున్నారని అడగారు.


నృత్యాలతో కరోనాపై అవగాహన

కావలి, జనవరి 6: కరోనా ప్రభావంపై ప్రజలకు స్థానిక శ్రీలక్ష్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ఫిజియోథెరపీ, నర్సింగ్ విద్యార్థులు శనివారం మెరుపు నృత్యాల(ఫ్లాష్ మోబ్)తో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో మానవహారంగా ఏర్పడి, చైతన్య గీతాలకు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవరెడ్డి, రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ రవిప్రకాష్, ఆర్టీసీ డీఎం ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పొంచి ఉన్న కరోనా ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ వలంటీర్లు మాస్కులు పంపిణీ చేశారు.

నేడు కరసేవకులకు సత్కారం

కందుకూరు : రామమందిరం కోసం అయోధ్య వెళ్లిన కరసేవకులకు బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సత్కారం నిర్వహించనున్నట్లు ఆపార్టీ నాయకుడు మన్నేపల్లి వరప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పెద్దబజారులోని కోదండరామాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంల పనితీరును వివరిస్తున్న తహసీల్దారు

సీతారామపురం, జనవరి 6: ఎన్నికల సమీపిస్తుండడంతో ఈవీఎం మిషన్, ఓటు నమోదు ప్రింటింగ్ యంత్రాలపై శనివారం స్థానిక శ్రీశక్తి భవన్ కార్యాలయంలో బీఎల్‌వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సీతారామపురం, బసినేనిపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ పరిధిలోని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుధాకర్‌రావు, ఇన్చార్జ్ ఎంపీడీవో భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మార్పు బాలకృష్ణమ్మకు ఘన నివాళి

కలువాయి, జనవరి 6 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా, ఉద్యమకర్తగా ఉపాధ్యాయులకు సేవలు అందించిన మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి శనివారం కలువాయి ఏపీటీఎఫ్-1938 కార్యాయలంలో నిర్వహించారు. బాలకృష్ణమ్మ చిత్రపటంకు పూలమాల వేసి నివాళు ర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జీవీ మురళీకృష్ణ, అధ్యక్షుడు నాపా నాగరాజు, ఉపాధ్యాయులు షేక్ రఫీ, జీ నందకిషోర్, కె దిలీప్‌కుమార్, జీవీ రమణయ్య, టీపీ నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

51 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి రూరల్, జనవరి 6: పట్టణంలోని గండిపాళెం మార్గంలో గల పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్స్ దుకాణాలపై శనివారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల సమాచారం మేరకు కూల్‌డ్రింక్స్ దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నాగిళ్ల మార్తమ్మ వద్ద 23, నాగిళ్ల బాలమ్మ వద్ద 23 మద్యం సీసాలు, 5 బీర్లతోపాటు మొత్తం 51 సీసాలను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకొన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎవరైనా అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ, సిబ్బంది

గిరిజనులు అభివృద్ధి పథంలో నడవాలి : బీఎమ్మార్

అల్లూరు, జనవరి 6 : సమాజంలో గిరిజనులు అభివృద్ధి పథంలో నడవాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని ఇస్కపల్లి బీఎంఆర్ గిరిజన కాలనీలో శనివారం జగనన్న గృహ నిర్మాణాలకు శంకుస్థాపన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు ఉన్నాయని, వారి అభివృద్ధికి పలు మార్గాలను ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ శశిరేఖ, స్థానిక నాయకులు బీద రమేష్‌బాబు, సర్పంచి రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గృహాల శంకుస్థాపనలో బీద మస్తాన్‌రావు

ఆలయాభివృద్ధికి విరాళం

కావలి : రూరల్ మండలం కొత్తసత్రంలోని ఇందిరానగర్ ఉన్న రామాలయం అభివృద్ధికి పీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధా కర్ రూ.2 లక్షలు విరాళం అందించారు. శనివారం గ్రామంలో పర్య టిస్తున్న సుధాకర్‌ను గ్రామస్థులు కలిసి ఆలయ అభివృద్ధికి సహ క రించాలని కోరారు. దీంతో ఆయన రూ. 2 లక్షలను ఆలయ కమి టీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటిని అభినందించారు.



విరాళం అందిస్తున్న సుధాకర్

మాలకొండ ఆదాయం రూ. 6,73,860

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,73,860 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 4,250, కుంకుమార్చన ద్వారా రూ. 19,880, వివాహాల ద్వారా రూ. 10 వేలు, తలనీలాల ద్వారా రూ. 20,525, వాహనపూజల ద్వారా రూ. 2,720, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,15,600, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 980, రూముఅద్దెల ద్వారా రూ. 32,460, కవర్ల ద్వారా రూ. 3,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,62,215, అన్నదానం ద్వారా రూ. 2,72,898, విరాళాల ద్వారా రూ. 28,732 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

నడివీధి పోలేరమ్మ జాతరకు అంకురార్పణ

కావలి, జనవరి6 : పట్టణంలోని పాతూరు నడివీధి పోలేరమ్మ జాతరకు శనివారం అంకురార్పణ జరిగింది. అమ్మవారి వద్ద ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆది లక్ష్మీలు పూజలు నిర్వహించి, హారతులిచ్చి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో దొడ్ల వినయకుమార్‌రెడ్డి, కాటా వెంకారెడ్డి, ఈతముక్కల బాల మురళీధర్ రెడ్డి, దొడ్ల మనోహర్ రెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, కాటా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతర ఏర్పాట్లను డీఎస్పీ ఎం. వెంకటరమణ, సీఐ రాజేష్‌లు పరిశీలించారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

కావలి : చిన్న వయసులోనే అమ్మాయిలకు వివాహాలు చేస్తే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రియదర్శిని మహిళామండలి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాల ప్రభావంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయిని ఏఎంవీ శేషమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఖాదర్‌బీ, షేక్ ఖాదర్‌బాష, మహ్మద్ అబ్దుల్ అలీమ్, ఎంపీ ప్రసాద్‌రావు, మొఘల్‌సిరాజ్‌బేగ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు

లింగసముద్రం, జనవరి 6 : మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని బంకులు, బడ్డీ కొట్లు, ఇంకా చిన్న చిన్న అంగళ్లు, కొన్ని ఇళ్లలో మద్యం సీసాలు నిల్వ ఉంచుకొని అమ్ముకుంటున్నారు. ఈ మద్యం సీసాలు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే సరఫరా అవుతున్నట్టు ఆరోపణలున్నాయి. మండలంలోని లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వాస్తవానికి ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం సీసాలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తీసుకెళతుంటారు. అయితే వీరు మద్యం దుకాణాల వద్ద ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా సొమ్ము చెల్లించి కొనుగోలు చేసి, తమ బెల్టు షాపుల వద్ద రూ.20 నుంచి రూ.50 అధిక ధరకు అమ్ముతుంటారు. మంచినీరు, కూల్‌డ్రింక్స్ ఇతర వస్తువులు విక్రయిస్తూ, వాటితోపాటు మద్యం కూడా అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మండలంలో ప్రతి గ్రామంలో మద్యం సులభంగా దొరుకుతుండడంతో యువకులు మద్యానికి బానిసలై కుటుంబాలను గుల్ల చేసుకుంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యం ఏరులై పారుతోంది.ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హాస్టల్ విద్యార్థులను కాపాడాలని ధర్నా

కావలి : దళిత, గిరిజన హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను కష్టాల నుంచి కాపా డాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. దళిలగిరిజన హాస్టళ్ల శ్లాబ్ పెచ్చులు ఊడుతూ, తలుపులు లే క శిథిలావస్థకు చేరాయన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు విజయరత్నం, జీ. అశోక్, ఎన్ రుషి, కే. చందు, శశికుమార్, చౌటూరి వెంకటరత్నం, గోళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

దగదర్తి(బిట్రగుంట): దగదర్తి మండలం చెన్నూరులో శనివారం ఎంపీపీ తాళ్ళూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల యువత అధ్యక్షుడు వీ మహేష్‌నాయుడు, ఎంపీటీసీ సీహెచ్ సుశీల, మాజీ ఎంపీటీసీ వీ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, ఏఎస్ పేట

అభివృద్ధికి నిపుణుల బృందం ప్రణాళిక



ఏఎస్ పేట, జనవరి 6:ఆత్మకూరు, ఏఎస్ పేట ప్రాంతాలను ఏడీఎఫ్ సహకారంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపకల్పనకు నిపుణుల బృందం శనివారం పర్యటించింది. ఏడీఎఫ్ సభ్యుల కోరిక మేరకు ఆత్మకూరు, ఏఎస్ పేట ప్రాంతాల్లో పర్యటించి, తొలుత ఏఎస్ పేట ఖాజా నాయబ్‌రసూల్ దర్గాను సందర్శించారు. అనంతరం దర్గా పరిసర ప్రాంతాల్లో పరిశీలించి, తక్కువ స్థలంలో ఎక్కువ మంది ఉన్నారని, ఆధునీకరణతో అభివృద్ధి చేస్తే దర్గాకు అధిక సంఖ్యలో భక్తులు పెరిగే అవకాశం వుందన్నారు. అనంతరం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి మున్సిపాలిటీ అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనపై చర్చించారు. అందుకు ప్రణాళికను తయారు చేసి త్వరలో ఎమ్మెల్యేకి అందిస్తున్నట్లు బృందం తెలిపింది.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, జనవరి 6 : పట్టణంలో ఇటీవల మృతిచెందిన నలుగురి కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందచేశారు. 22 వార్డులోని తోటి చినకొండయ్య, జేఆర్ పేటలోని షేక్ సత్తార్, క్రిస్టియన్‌పేటలోని కనుపూరు ప్రేమకుమార్, 9వ వార్డులోని సిద్దివాటం సీతారామయ్య కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మహబూబ్‌బాష, సూరా భాస్కర్‌రెడ్డి మెప్మా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కేవి శేషారెడ్డి, యానాదిరెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కుమార్తె పెళ్లి సంబంధాలకు వెళుతూ తండ్రి మృతి


లింగసముద్రం, జనవరి 6 : కుమార్తెకు పెళ్లి సంబంధం మాట్లాడా నికి వెళ్తూ కందుకూరుకు చెందిన షేక్ కాలేషా(67)మృతి చెందారు.ఈ సంఘటన ఉలవపాడు మండలం కే రాజుపాలెం-చాగల్లు మధ్య జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కందుకూరుకి చెందిన కాలేషా కారులో తన బంధువులు నలుగురితో కలిసి కుమార్తె వివాహం గురించి మాట్లాడానికి నెల్లూరు వెళ్తూ ముందు వెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ముందు వెళ్తున్న వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో ఈ ప్రమాదం జరిగింది.ఈ సంఘటనలో కాలేషా మృతి చెందగా, మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.విషయం తెలిసిన ఎస్సై బాజిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి కాలేషా మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం వైద్యశాలకు తరలించారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



నుజ్జు నుజ్జయిన కారు

వైభవంగా ఊంజల్‌సేవ

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు ,అభిషేకాలు,ఊంజల్‌సేవ వైభవంగా జరిగాయి. నెల్లూరుకు చెందిన పాతపాటి మధుసూదన్‌రెడ్డి-సులోచన దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఊంజలసేవ ఉభయ కర్తలుగా నెల్లూరు జడ్పీ కాలనీకి చెందిన చాకవరపు కృష్ణయ్య-గిరిజమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేగంగా బైపాస్ పనులు

వలేటివారిపాలెం : ప్రకాశం జిల్లా సింగరాయికొండ నుంచి నెల్లూరు జిల్లా మాలకొండ వరకు బైపాస్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.233 కోట్లతో 45.7 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. మండలంలోని అయ్యవారిపల్లె, చుండి, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, కూనిపాలెం, పోకూరు, తదితర గ్రామాల గుండా జరుగుతున్న బైపాస్‌లో వంతెనల పనులు చివరి దశలో ఉన్నాయి. పనులు పూర్తయి వాహనాలు రాకపోకలు సాగిస్తే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

పింఛన్ల పంపిణీ

కోవూరు, జనవరి6: మండల పరిధిలోని కొత్తగా మంజూరైన 402 మందికి పింఛన్లను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అందజేశారు. శాశ్వత భూహక్కు పథకం ద్వారా రైతులకు పట్టాలను, ఆడుదాం ఆంధ్రా పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజనబాబురెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ శ్రీలత, ఎంపీడీవో శ్రీహరి పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం అవివేక చర్య

కోవూరు: అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అవివేక చర్య అని సీపీఎం నాయకులు చంద్ర రాజగోపాల్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్ వాడీలను ఉద్దేశించి శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, అఫ్రోజ్, బాబు తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు వై సుజాత, వై సుభాషిణి, కవిత, ఎల్వీ శేషమ్మ పాల్గొన్నారు.

రామయ్య అక్షితల పంపిణీ

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో అయోధ్య రామయ్య అక్షితలను పంపిణీ చేశారు. అనంత రం గోడలపై శ్రీరామ ముద్రలను ప్రచురించారు. రామ భక్తులు శ్రీనివాసులు, రామసుబ్బయ్య, నారాయణ స్వామి, సీనయ్య, గోలి సురేంద్ర, గంపల వెంకటేశ్వర్లు, కొమరిక వెంకటేశ్వర్లు, మర్రి పెంచల నరసయ్య పాల్గొన్నారు.

మనుబోలు వైద్యురాలిగా మొహిసీనా సుల్తానా

మనుబోలు, జనవరి 6: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా మొహిసీనా సుల్తానా శనివారం బాధ్యతలు చేపట్టారు. పీహెచ్‌సీలో వైద్యులుగా పనిచేస్తున్న సుబ్బరాజు డిసెంబర్ 31న పదవీ విరమణ అయ్యారు. దీంతో ఆయన స్థానాన్ని భర్తీ చేస్తూ ప్రభు త్వం ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న డా. మొహిసీనాను మనుబోలు వైద్యురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీకి ఓటమి తథ్యం : పోలంరెడ్డి



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

కొడవలూరు జనవరి 6: రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తథ్యమని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మండలంలో నార్తురాజుపాలెంలో ఉన్న పీఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం పాత వంగళ్ళ పంచాయతీ పరిధిలో సుమారు 300 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి వడ్లమూడి నరేంద్ర ఆధ్వర్యంలో చేరాయి. వారికి శ్రీనివాసులురెడ్డి టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పాతవంగళ్లు దశదిశా మార్చామన్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి పరిచామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రావెల్, ఇసుక, మద్యం మాఫియాలకు అడ్డాగా మారిందన్నారు. సీఎంగా చంద్రబాబు నాయుడు రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెముకుల చైతన్య, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, చెక్కా మదన్, వడ్లమూడి నరేంద్ర, కోడూరు విజయ్ కుమార్, గరికపాటి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పేదల సమస్యలు పరిష్కారం

కోవూరు, జనవరి 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబు సీఎం అయితేనే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. పాటూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న టీడీపీ బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, ఇంతా మల్లారెడ్డి, బాలరవి, నాటకరాని వెంకట్, గునపాటి రవీంద్రరెడ్డి, పనం వంశీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ప్రతి అడుగు ప్రజల కోసమే, భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● టీడీపీ సిటీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ



మాట్లాడుతున్న నారాయణ, పక్కన అజీజ్, కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 6 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నారాయణ వైద్య కళాశాలలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన టీడీపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అభిమానులందరూ సమష్టిగా కష్టపడి పనిచేసి విజయానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు వైసీపీ వైఫల్యాలు, అరాచకాలను తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతని గమనించిన వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేస్తున్నారన్నారు. ఒక్కఛాన్స్ పేరుతో జగన్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లా డుతూ 2024లో వైసీపీ ఓటమి డిసైడ్ అయిపోయిందని, టీడీపీ జనసేన గెలుపు ఖాయమైందని జోస్యం చెప్పారు. నగరంలో నారాయణ భారీ మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.

అర్బన్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 : నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. నూతన కార్యవర్గం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కార్యదర్శి కోట సత్యనారాయణ, కోశాధికారి సోమిశెట్టి రమేష్‌బాబు, యువజన విభాగం అధ్యక్షుడు గాదంశెట్టి హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి మునగా వెంకటసాయిచైతన్య, కోశాధికారి పెంట్యాల శశిధర్, వాసవీ దళ్ అధ్యక్షుడుగా అనుమాలశెట్టి నితిన్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా తులసి శ్రీకళ, ప్రధాన కార్యదర్శి గంగిశెట్టిట రాధా, కోశాధికారి మెంటా స్వర్ణమాల్యాలు ఆర్యవైశ్య మహాసభ బైలా ప్రకారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో మైపాడు గేట్ వద్దఉన్న కేసీఆర్ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరువీధి ప్రకాష్‌రావు, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, ఉపాధ్యక్షుడు మెంటా గురుబ్రహ్మం, గౌరవ సలహాదారుడు మట్టా ఆంజనేయులు, కార్యవర్గ సభ్యుడు భవనాసి సురేష్‌బాబులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్ శంకర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఇదే కల్యాణ మండపంలో నూతన కార్యవర్గానికి అభినందన సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. తమ కార్యవర్గం తొలి సేవా కార్యక్రమంగా 330 మంది పేద ఆర్యవైశ్యులకు ఫల సరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సభకు హాజరైన మహిళలకు లక్కీ డీప్ ద్వారా 20 శారీలు అందజేస్తామన్నారు. ఆర్యవైశ్య కుటుంబాలు తరలివచ్చి ఆశీర్వదించాలని కోరారు.

మద్య నిషేధంపై నీ మాట ఏమైంది జగన్..!

● టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జనవరి 6 : మాట మారవను.. మడమతిప్పను అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఆ రెండింటినీ పూర్తిగా విస్మరించి దేశంలోనే చెత్త ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కాడని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త పన్ను వేసి చెత్త ముఖ్యమంత్రిగా ఖ్యాతిగడించారన్నారు. దోచుకోవడం, దాచుకోవడమే జగన్ నైజమన్నారు. విద్యుత్ బిల్లులు పెంచి మాటతప్పారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ఒక్కటే ప్రస్తుతం జరుగుతున్న పాలన అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో టీడీపీ, జనసేన కూటమి 160 స్థానాలను కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. రా... కదిలిరా..! పేరుతో చంద్రాబు సభలకు ప్రజలకు భారీగా తరలివస్తున్నారని, దీంతో జగన్‌లో వణుకుపుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి వెంకటేశ్వర్లు, మలినేని వెంకయ్యనాయుడు, జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, శివ, శ్యాం పాల్గొన్నారు.

కోటంరెడ్డి కుటుంబీకుల ఇంటింటా ప్రచారం

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, కుమార్తెలు లక్ష్మీహైందవి, సాయి వైష్ణవిలు 1వ డివిజన్ పరిధిలోని దొరతోపు కాలనీ, 4వ మైలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా, రూరల్లో శ్రీధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా చేయాలని అభ్యర్థించారు.

ఎస్టీయూ గోడపత్రిక ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో గంగాభవాని

నెల్లూరు(విద్య), జనవరి 6 : ఎస్టీయూ వజ్రోత్సవాల గోడ పత్రికను డీఈఓ గంగాభవాని శనివారం ఆవిష్కరించారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎస్టీయూ వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ సంఘాలు వారి సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు విధుల్లో అంకితభావంతో పనిచేసి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని తెలిపారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోను రాజమనోహర్ మాట్లాడుతూ 1946లో ప్రారంభమైన తమ సంఘం ఎన్నో ఉద్యమాలతో విజయాలను సాధించి ఉపాధ్యాయులకు, విద్యారంగ ఉన్నతికి పాటుపడిందన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలులోని ఎగ్జిబిషన్ మైదానంలో ఈనెల 12, 13వ తేదీల్లో వజ్రోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శి అశోక్‌బాబు, నేతలు కె.నరసింహం, వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకటసుబ్బయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, నారాయణరెడ్డి, రవీంద్ర, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని ఫోన్‌లో పరామర్శించిన సీఎం

నెల్లూరు(విద్య), జనవరి 6 : ఇటీవల రోడ్డు ప్రమా దానికి గురై చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శనివారం ఫోన్‌లో పరామర్శిం చారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు సంబంధిత ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే ప్రభు త్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ.సుబ్బారెడ్డి, సీఎం కార్యాల య ప్రతినిధి హరికృష్ణలు కూడా ఎమ్మెల్సీని ఫోన్‌లో పరామర్శించి హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ సీఎంతో పాటు నేతలందరికీ ధన్యవాదాలు తెలి యచేశారు.

అంబేడ్కర్‌ను స్మరించుకుందాం : కమిషనర్



అంబేడ్కర్ ఫొటోతో ఉన్న టీషర్టును పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 6 : ఈనెల 19వ తేదీన విజయవాడలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో నెల్లూరులో అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హించి ఆయనను స్మరించుకునేం దుకు ప్రజలంతా తరలిరావాలని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. అందులో భాగంగా శనివారం వీఆర్సీ కూడలి వద్దనున్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన పరిశీలించారు. 8వ తేదీన నెల్లూరులోని అన్ని అంబేడ్కర్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి ఘననివాళులర్పించాలన్నారు. 9న అంబేడ్కర్ స్మృతివనం గురించి నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రం లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సిటీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల అధికారులకు అందిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఆర్డీఓ మలోలా



ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

నెల్లూరు(విద్య), జనవరి 6 : విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ ఏ.మలోలా తెలిపారు. నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో శనివారం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ఓటు హక్కును సక్రమంగా వినియోగిం‌చుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి, లాండ్ రెవెన్యూ అధికారి పీ.శైలకుమారి, డిప్యూటీ తహసీల్దారు ఈ.బాలకోటమ్మ, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి జి.జోజి, అధ్యాపకులు టీరాంబాబు, వీరమణారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అబద్ధాలతో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన

నెల్లూరు(విద్య), జనవరి 6 : ప్రజలకు నిత్యం అసత్యాలు చెపుతూ అబద్ధాలతోనే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన చేస్తోందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర విమర్శించారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధం తప్ప నిజం చెప్పలేని ముఖ్యమంత్రి ఉండడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టకరమన్నారు. అధికారంలోకి వస్తే రూ.3వేలు పెన్షన్ ఇస్తానని నమ్మించి వంచించిన జగన్మోహన్‌రెడ్డి పెన్షన్ల గురించి నిజాలు చెప్పే ధైర్యముందా అని ప్రశ్నించారు. రూ.3వేల పెన్షన్‌పై మాటమార్చి ఒక్కొక్కరికి రూ.30వేలు ఎగనామం పెట్టారన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చేనాటికి రూ.200లు ఉన్న పెన్షన్ 2019 నాటికి రూ.2వేలు చేశారన్నారు. ఐదేళ్లలో చంద్రబాబునాయుడు రూ.1800లు పెంచడంతో పాటు పెన్షన్ లబ్ధిదారుల సంఖ్యను 34 లక్షల నుంచి 54.25లక్షలకు పెంచారన్నారు. జగన్‌రెడ్డి ఇప్పటి వరకు రూ.750లు మాత్రమే పెంచి తామేదో ఉద్ధరిస్తున్నట్లు ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

కేన్సర్ బాధితుడికి నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 6 : నగరంలోని 23వ డివిజన్ జనగణమన కాలనీలో నివాసం ఉంటున్న కేన్సర్ బాధితుడు యాకోబు కుటుంబానికి శనివారం అమ్మ ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు అందజేశారు. యాకోబు కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను టీడీపీ నాయకులు మాతంగి కృష్ణకు తాడిపర్తి బద్రి తెలియజేయడంతో ఆయన ఈ సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వరదరాజులు, రమేష్‌నాయుడు, మల్లి, సుబ్బరాయుడు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ



వృద్ధులకు ఆహారం పంపిణీ చేస్తున్న విద్యార్థులు

నెల్లూరు(విద్య), జనవరి 6 : నగరంలోని బాలాజీ నగర్ ఎడిఫై స్కూల్ ప్రీప్రైమరీ చిన్నారులు గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం మధ్నాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారుల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యం చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా వృద్ధులకు ఆహారాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల నిర్వాహకులు సునీత తెలిపారు. అనంతరం పెద్దవారితో ఎలా వ్యవహరించాలి, వారిని ఎలా ప్రేమించాలన్న విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కృష్ణచైతన్య కళాశాలలో టెక్నోఫెస్ట్

నెల్లూరు(విద్య), జనవరి 6 : నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంసీఏ విద్యార్థులకు విజ్ఞాన పేరుతో జాతీయస్థాయి టెక్నోఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్స్ డాక్టర్ ఆర్‌వీ.కృష్ణారెడ్డి, పీ.రాణా ప్రమోద్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం జరిగిన టెక్నికల్ సింపోసియంలో విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నో క్విజ్‌లు నిర్వహించారు. విజేతలకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు అంది ప్రసాద్, డాక్టర్ ఎం.హుస్సేనయ్య, డాక్టర్ జి.విజయలక్ష్మిలు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్స్ డాక్టర్ మల్లికార్జునయ్య, టి.జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాద్, ఎంసీఏ హెచ్ఓడీ ఏవీ.ఫణి కుమార్, కన్వీనర్ ఎన్.వెంకటకృష్ణ, రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, పీజీ, యూజీ, ఎంసీఏ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రొఫెసర్, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షితల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 6 : ఈనెల 22న అయోధ్య రామమందిరంలో శ్రీరామ చంద్రమూర్తి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి తరలిరావాలని నగరంలో కరపత్రాలు స్వామివారి అక్షితలను శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. శబరి శ్రీరామక్షేత్రం మేనేజరు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు రామ్‌నగర్, తదితర ప్రాంతాలలో అక్షితలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

ఉద్యమ ఉపాధ్యాయినికి ఘన నివాళి

నెల్లూరు(విద్య), జనవరి 6 : ఉపాధ్యాయ ఉద్యమ పితామహురాలు, స్ఫూర్తి ప్రదాత మార్పు బాలకృష్ణమ్మకు ఏపీటీఎఫ్ నేతలు నివాళులర్పించారు. శనివారం నగరంలోని వెంకటేశ్వర విద్యాలయంలో బాలకృష్ణమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యకమంలో రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, గౌరవాధ్యక్షుడు సదాశివరావు, మాజీ కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి వైసీపీ పెద్ద పీట

ముత్తుకూరు, జనవరి 6 : సామాజిక న్యాయానికి వైసీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. ముత్తుకూరు ప్రధాన కూడలిలో శనివారం జరిగిన సామాజిక సాధికారత సదస్సులో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సామాజికంగా సమ న్యాయం అమలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, వైసీపీ రాష్ట్ర మైనారిటీ విభాగ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, నెల్లూరు మేయర్ స్రవంతి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకుడు కోడూరు కల్పలత, మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



అన్నదానం చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

వెంకటాచలం : వెంకటాచలంలోని నాగూర్ మీరయ్య నిషాన్ దర్గా గంధ మహోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు ఇంతియాజ్, షేక్ బాబు, నిజాముద్దీన్, రోషన్ జమీర్, నస్రుద్దీన్, షాజహాన్ ఖాన్, అమృద్దీన్, సిరాజుద్దీన్, ఫక్రుద్దీన్, నయూమ్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, అక్మల్, మున్వర్, వసీమ్ గంధ మహోత్సవాన్ని పర్యవేక్షించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, ఈపూరు మునిరెడ్డి, సత్తార్ సాహెబ్, వైసీపీ నాయకులు వెంకటశేషయ్య, పెంచలయ్య, నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోస్టింగ్ ఇవ్వని అధికారులు

● సందిగ్ధంలో సీనియర్ అసిస్టెంట్

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి6: మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్‌గా కోడూరు పీహెచ్‌సీ జూనియర్ అసిస్టెంట్ సరితను పదోన్నతిపై నియమించారు. వారం క్రితం బదిలీ అయినా ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. అటు కోడూరులో సీనియర్ అసిస్టెంట్ పోస్టు లేక, జొన్నవాడలో సీనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇవ్వక సరితను సందిగ్ధంలో ఉంచారు. ఆమెను బదిలీ చేస్తూ గుంటూరు రీజినల్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినా జొన్నవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారి మాత్రం సీనియర్ అసిస్టెంట్‌ని విధుల్లోకి తీసుకోకపోవడం చర్చ నీయాంశమైంది.

నేదురుమల్లి గెలుపునకు కృషి

రాపూరు(డక్కిలి), డిసెంబరు 6 : వెంకటగిరి నియోజకవర్గం నుంచి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పోటీచేస్తే ఆయన గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని వైసీపీ సీనియర్ నాయకుడు పాపకన్ను మధుసూదనరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక తెలుగుగంగ అతిథిగృహంలో విలేఖర్లతో మాట్లాడుతూ శుక్రవారం రాపూరులో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి తదితరులు వున్నారు.

చంద్రబాబు పర్యటన రద్దుతో టీడీపీ శ్రేణుల్లో నిరాశ

రాపూరు(డక్కిలి), డిసెంబరు 6 : వెంకటగిరిలో ఈ నెల 9వ తేదీన జరగనున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన రద్దు కావడంతో రాపూరు టీడీపీ శ్రేణులు నిరాశకు గురయ్యారు. ఆరోజు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌తో జరిగే సమావేశానికి హాజరుకానున్న దృష్ట్యా చంద్రబాబు పర్యటన రద్దు అనివార్యమైంది. అయితే చంద్రబాబు పర్యటను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ భారీ ఏర్పాట్లు చేపట్టారు. మళ్లీ చంద్రబాబు పర్యటనను త్వరలోనే ప్రకటిస్తామని రాష్ట్ర పార్టీ నాయకత్వం స్పష్టచేసింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

వెంకటాచలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎం మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు అన్నారు. వెంకటాచలంలో అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఓడూరు వెంకటకృష్ణయ్య, మండల వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యుడు బిక్కి రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శి పగిడిపోగు కిరణ్ కిశోర్ ఉన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 6 : జొన్నవాడ పీహెచ్‌సీని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.దేవి సందర్శించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకానికి సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి వినయ్‌కుమార్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా అధికారులు ఉన్నారు.

● **గ్రామ సర్వేయర్ మృతి**

దామరమడుగు సర్వేయర్ షీలా కొంత అనారోగ్యానికితోడు మనస్థాపానికి గురై హఠాన్మరణానికి గురయ్యారు. కరోనా సమయంలో తల్లిదండ్రులతోపాటు భర్త కూడా మృతి చెందడం, దీనికితోడు పనిభారంతో కొంత కాలంగా మనస్థాపానికి గురయ్యారు. దీంతో ఈ నేపథ్యంలో శనివారం మృతి చెందారు. పలువురు అనారోగ్యానికి గురై ఆమె మృతి చెందినట్టు చెబుతుండగా, మరికొందరు పని ఒత్తిడితో గుండెపోటుకు గురై మృతి చెందినట్టు చెబుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సావిత్రిబాయి పూలే అవార్డులు



అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

పొదలకూరు, జనవరి 6 : యూటీఎఫ్ వారు ప్రదానం చేస్తున్న సావిత్రీబాయిపూలే అవార్డులకు మండలంలోని మర్రిపల్లి ప్రైమరీ హైస్కూల్ ఉపాధ్యాయిని ఏ జ్యోతి, బిరదవోలు యూపీ స్కూల్ ఉపాధ్యాయిని బి భారతీ దేవి, పొదలకూరు జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఎం జ్యోతి, ఆనాటి కండ్రిగ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని సీహెచ్ సుకేసిని, లింగంపల్లి ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని విక్టోరియారాణి, మరుపూరు జడ్పీ గర్ల్స్ హైస్కూల్ ఉపాధ్యాయిని పద్మావతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషులు, జీవీ చలపతిశర్మ, మండల శాఖ అధ్యక్షుడు శైలజ, జిల్లా కార్యదర్శి సుభాషిణి, రాష్ట్ర కౌన్సిలర్ బి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీవీపీ కల్యాణ్, మండల శాఖ కార్యకర్తలు అందరూ పాల్గొని అభినందించారు.

గిరిజనుల తుఫాన్ పరిహారం మింగేశారు : సోమిరెడ్డి



వెంకటాచలం, జనవరి 6 : కంటేపల్లి గిరిజనులకు మిచౌంగ్ తుఫాన్ పరిహార సొమ్ము పూర్తిగా ఇవ్వకుండా అరకొరగా ఇచ్చి మిగిలిన సొమ్ము వైసీపీ నాయకులు మింగేయడం దారుణమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కంటేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరించి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించి రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలకు మద్దతు తెలపాలని కోరారు. వైసీపీ ప్రభుత్వానికి సామాజిక సాధికారత బస్సు యాత్ర చేపట్టే నైతిక హక్కు, అర్హత లేదన్నారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, కుంకాల నాగేంద్ర ప్రసాద్, దావా పెంచలరావు, నాగార్జునరెడ్డి, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, పద్మనాభ నాయుడు, కొదండయ్యనాయుడు, పార్ధసారధినాయుడు, ఆస్తోటి వెంకటసుబ్బయ్య, నాగరాజు, సుధాకర్, నందకిషోర్, ఏడుకొండలు, మల్లికార్జున్, షేక్ రఫి తదితరులున్నారు.

రైతు సమస్యలపై సదస్సులు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి6: రైతుల సమస్యలపై మండలంలోని జొన్నవాడ, పెనుబల్లి గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రీసర్వేతో తలెత్తిన సమస్యలు, సాదాబైనామా, జాయింట్ ఎల్‌పీఎంలు తదితర సమస్యలపై ఆయా గ్రామాల్లో రైతుల నుంచి రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించారు. సదస్సుల్లో తహసీల్దారు వీరి సుధీర్, ఆర్ఐలు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.





అధికార పార్టీ స్టిక్కర్‌తో కారు

తప్పుకదా గోవిందా..!

● అధికార పార్టీ స్టిక్కర్‌తో తిరుమలకు వచ్చిన కారు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వైసీపీ స్టిక్కర్‌తో ఉన్న కారు శనివారం తిరుమలలో కనిపించింది. సాధారణంగా రాజకీయ పార్టీ జెండాలు, గుర్తులు, వ్యక్తుల ఫొటోలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే ఏపీ 02 ఏపీ 3699 నెంబరు గల కారుపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను ఉంచి తిరుమలకు తీసుకువచ్చారు. కారును తిరుమలలోని పరకాలస్వామి మఠం వద్ద పార్కింగ్ చేసి వెళ్లారు. నిబంధనలను ఉల్లంఘించినా టీటీడీ భద్రతా సిబ్బంది మాత్రం ప్రశ్నించకుండా మౌనంగా ఉండిపోవడం గమనార్హం. ఈ ఘటనతో అలిపిరిలో తనిఖీలపై కూడా విమర్శలు వచ్చాయి.





నారావారిపల్లెలో ముస్తాబవుతున్న చంద్రబాబు ఇల్లు

చంద్రబాబు ఇంటికి సంక్రాంతి ముస్తాబు

చంద్రగిరి, జనవరి 6: మాజీ సీఎం చంద్రబాబు తన కుటుంబీకులతో కలిసి సంక్రాంతి పండగకు స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. వీరితో పాటు నందమూరి కుటుంబీకులు కూడా వస్తున్న విషయం తెలిసిందే. దాంతో నారావారిపల్లెలోని ఆయన ఇంటిని ముస్తాబు చేస్తున్నారు. ఇంటికి పెయింటింగ్ వేసి, ఆవరణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధులు, కులదైవం నాగాలమ్మ ఆలయం, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. పార్కింగ్, భద్రతా సిబ్బంది ఉండటానికి టీటీడీ కళ్యాణ మండపంలో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా టీటీడీ కళ్యాణ మండపం, అతిథి గృహాన్ని ముందుగా బుక్ చేశారు.

పండగకు 233 అదనపు బస్సులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 6: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రధాన నగరాలకు అదనంగా 233 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. ● 10, 11, 12 తేదీల్లో హైదరాబాదుకు 15, బెంగళూరుకు 40, చెన్నైకి 17, విజయవాడకు 11, ఇతర మార్గాలకు 55 ● 15, 16, 17 తేదీల్లో హైదరాబాదుకు 16, బెంగళూరుకు 1, చెన్నైకి 16, విజయవాడకు 8, ఇతర మార్గాలకు 10 బస్సుల చొప్పున ఉన్నాయి.

టీడీపీ అధినేత వెంకటగిరి పర్యటన వాయిదా

వెంకటగిరి, జనవరి 6: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 9వ తేదీన వెంకటగిరి మున్సిపాలిటీలో నిర్వహించనున్న రా కదలిరా బహిరంగ సభ వాయిదా పడినట్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌తో అత్యవసర సమావేశం ఉందన్నారు. అందువల్ల చంద్రబాబు పర్యటన వాయిదా పడిందని పేర్కొన్నారు. త్వరలోనే పర్యటన తేదీ ఖరారు చేస్తామని వివరించారు. అయితే మరోవైపు వెంకటగిరి- తిరుపతి రోడ్డు మార్గంలో బహిరంగ సభా ప్రాంగణంలో ఏర్పాట్లు మాత్రం చురుగ్గా సాగుతూనే ఉన్నాయి.



పర్యటన రద్దయినా సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులు

మీరే దిక్కు..!

టికెట్ల కోసం వైసీపీలో వేడుకోళ్లు





తిరుపతి జిల్లాలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ స్థానాల్లో తిరిగి పోటీ చేయడానికి ఆఖరి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ఒక్కోరు ఒక్కో దారి ఎంచుకున్నారు. అధినేత నిర్ణయం కోసం అభద్రతతో వీరు దినదినగండంగా రోజులు గడుపుతున్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలుండగా అందులో సగం సెగ్మెంట్లలో వైసీపీ టికెట్ ఎవరికన్నది తేలక శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. మరోవైపు ఆశావహులూ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

విజయవాడలో కేజే దంపతుల మకాం

నగరి వైసీపీ టికెట్ ఆశిస్తూ మున్సిపల్ మాజీ చైర్మన్లు కేజే కుమార్, కేజే శాంతి దంపతులు వారం రోజుల నుంచి విజయవాడలోనే మకాం వేశారు. నగరి సెగ్మెంట్‌లో మంత్రి రోజాను తొలినుంచీ వ్యతిరేకిస్తున్న వైసీపీ నేతల్లో వీరు ముఖ్యులు. రోజా వ్యతిరేక బృందంలోని శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట మండల నేత మురళీధర్‌రెడ్డి కూడా వారం కిందట విజయవాడకు వెళ్లారు. సీఎం సన్నిహితులను కలసి రోజాకు టికెట్ కేటాయించవద్దని గట్టిగా పట్టుబట్టారు. ఆమెకు కాకుండా తమలో ఎవరికి ఇచ్చినా పర్లేదని, కొత్తవారికి ఇచ్చినా అభ్యంతరం లేదని ప్రతిపాదించారని తెలుస్తోంది. కీలక నేతల ద్వారా సీఎం జగన్‌ను కలిసే ప్రయత్నం చేశారు. అయితే అధినేతను ఎట్టి పరిస్థితుల్లోనూ కలవద్దని, కలిస్తే నచ్చజెప్పి రోజా గెలుపు కోసం పనిచేయాల్సిందిగా జగన్ ఒప్పిస్తారని చిత్తూరు ప్రాంతానికి చెందిన ఓ నేత సలహా ఇవ్వడంతో నిజమేననిపించి చక్రపాణిరెడ్డి, మురళీధర్‌రెడ్డిలు వెనుదిరిగి వచ్చేసినట్లు సమాచారం. అయితే కేజే కుమార్ దంపతులు పట్టుదలగా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు వారి సన్నిహితులు చెబుతున్నారు.

మీరే దిక్కంటూ..

సత్యవేడు నుంచీ తిరిగి టికెట్ దక్కడంపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం కుమారుడు సుమన్‌ను వెంటబెట్టుకుని మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. మిమ్మల్నే నమ్ముకున్నాం, మీరే దిక్కంటూ తండ్రీ కొడుకులిద్దరూ ఆయన పాదాలపై పడినంత పనిచేశారు. మంత్రి మాత్రం తన చేతుల్లో ఏమీ లేదని, అధినేత జగన్ నిర్ణయానుసారమే టికెట్ల కేటాయింపు జరుగుతుందని చెబుతూనే తన వంతు మాటసాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం. తండ్రీకొడుకులు పెద్దిరెడ్డిని కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అందులో ఎమ్మెల్యే, ఆయన తనయుడు మంత్రి ఎదుట చేతులు కట్టుకుని అత్యంత వినయంగా నిల్చొని ఉండడం, మంత్రి కాళ్లకు దండం పెడుతున్నట్టుగా ఉండడం వంటివి దళిత సామాజిక వర్గాల్లో విద్యావంతులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయి. రాజకీయ భవిష్యత్తు కోసం అగ్రవర్ణాల నేతల వద్ద ఇంతగా సాగిలబడడం ఏమిటన్న ఆగ్రహం వారిలో వ్యక్తమవుతూండడం గమనార్హం. మరోవైపు పూతలపట్టు ప్రాంతానికి చెందిన ఓ పోలీసు సీఐ భార్య పేరు కొత్తగా ఇక్కడ తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లోనే ఆమె టికెట్ కోసం యత్నించగా దాదాపు ఖరారై చివరి క్షణంలో చేజారిపోయినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



గూడూరు తెరపైకి మరొక పేరు

గూడూరు నుంచి వైసీపీ టికెట్ కోసం యత్నిస్తున్న వారిలో తాజాగా మన పాటి రవీంద్రబాబు పేరు తెరపైకి వచ్చింది. గూడూరు పట్టణంలో రెండు విద్యాసంస్థలను కలిగి ఉన్న ఇతను 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసి 27,375 ఓట్లు సాధించారు. పీఆర్పీ.. కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కొంతకాలం కాంగ్రెస్‌లో కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. మూడేళ్లుగా హైదరాబాదులో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. సీఎం సన్నిహితుల్లో ఒకరి ద్వారా ప్రస్తుతం టికెట్ రేసులో నిలిచారు. గూడూరులో స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న ప్రతిపాదనలో భాగంగా సీఎం సన్నిహితులొకరు ఇతడి పేరు సూచించినట్టు సమాచారం. దీంతో ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌ను కాదని టికెట్ రేసులో ఉన్న ఓ రెవెన్యూ అధికారి, ఎమ్మెల్సీ మేరుగ మురళీధరరావుల తోపాటు తాజాగా రవీంద్ర బాబు కూడా చేరారు.

జగన్ కోర్టులో సూళ్లూరుపేట బంతి

సూళ్లూరుపేట వైసీపీ టికెట్ ఈసారి ఎవరికి దక్కుతుందనే విషయంలో ఇప్పటికీ స్పష్టత రాలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఈసారి టికెట్ ఇవ్వొద్దని పలువురు పార్టీ నేతలు గట్టిగా పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన పంచాయితీలు కూడా ఇరువర్గాల మధ్యా సయోధ్య కుదర్చలేకపోయాయి. దీంతో ఇపుడు బంతి నేరుగా సీఎం జగన్ కోర్టుకు చేరింది. అక్కడ ఏమి జరుగుతోందో పార్టీ వర్గాలకు తెలియడం లేదు. మరో నాలుగైదు రోజుల్లో టికెట్ విషయమై స్పష్టత వస్తుందని ఇరువర్గాలూ చెబుతున్నాయి.

'ఎస్మా' ప్రయోగిస్తారా?

● జీవో ప్రతులను తగులబెట్టిన అంగన్వాడీలు



కోటలో జీవో ప్రతులను తగులబెడుతున్న అంగన్వాడీలు



తిరుపతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న తమపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం పట్ల అంగన్వాడీ ఉద్యోగులు శనివారం జిల్లావ్యాప్తంగా ఆందోళనకు దిగారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఓవైపు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూనే మరోవైపు ఎస్మా ప్రయోగానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నాయుడుపేట, కోటల్లో రిలే నిరాహార దీక్ష కొనసాగించిన ఉద్యోగులు శిబిరం వద్ద ఎస్మా ప్రయోగానికి సంబంధించిన జీవో నెంబరు-2 ప్రతులను తగులబెట్టారు. తిరుపతిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, సత్యవేడు, పిచ్చాటూరుల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చంద్రగిరిలో రిలే నిరాహార దీక్షా శిబిరంలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేయగా.. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, పుత్తూరు, శ్రీకాళహస్తి తదితర చోట్ల రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.

తిరుపతిలో ఎస్మా చట్టం ప్రతులను తీసుకోవడానికి నిరాకరణ

వెనుదిరిగిన తిరుపతి సీడీపీవో

ఎస్మా చట్టానికి సంబంధించిన జీవో ప్రతులను ఇవ్వడానికి శనివారం సాయంత్రం తిరుపతిలోని అంగన్వాడీల దీక్షా శిబిరానికి సీడీపీవో సుధారాణి వచ్చారు. దాంతో సమస్యలు పరిష్కరించకుండా ఇదేంటని ప్రశ్నిస్తూ.. ప్రతులను తీసుకోవడానికి నిరాకరించారు. దాంతో ఆమె చేసేదేమీలేక వెనుదిరిగారు.



తిరుపతిలో...

18వ రోజుకు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె

తిరుపతి(విద్య), జనవరి 6: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజుకు చేరుకుంది. సంఘ గౌరవాధ్యక్షుడు నాగ వెంకటేశ్ మాట్లాడుతూ అమరావతిలోని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని, త్వరలో ఉద్యోగులను చర్చలకు ఆహ్వానిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 34 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

18నుంచి జాతీయ సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6: తిరుపతిలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ(ఆరోగ్యకరమైన గ్రామం) అంశంపై జరగనున్న జాతీయ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ జాతీయ సదస్సుపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యే సదస్సుకు సంబంధించి ఏర్పాటు చేసిన 24 కమిటీలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్,డీఆర్వో, డీపీవో తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో ఆటోడ్రైవర్ కిడ్నాప్

- దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. విజయవాడకు పయనమైన అయ్యప్ప భక్తులు
- అడ్డుకుని, బాధితుడిని విడిపించిన పోలీసులు
- శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించిన ఘటన

శ్రీకాళహస్తి జనవరి 6: ఓ ఆటో డ్రైవర్‌పై అయ్యప్ప భక్తులు దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. సినీ ఫక్కీలో కిడ్నాప్ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించింది. స్థానికులు పోలీసులు అడ్డుకుని, బాధితుడిని విడిపించి 14 మందిపై కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలానికి చెందిన ధర్మేంద్ర శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మచిలీపట్నానికి చెందిన కొందరు భక్తులు శబరిమల యాత్రకు వెళ్లారు. దీక్ష విరమించాక తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తికి శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ముక్కంటి ఆలయ దర్శనానంతరం టూరిస్టు బస్టాండు వద్ద మరో బస్సులోని భక్తులతో మాటామాటా పెరగడంతో వాగ్వాదానికి దిగారు. దీన్ని గమనించిన ఆటో డ్రైవర్ ధర్మేంద్ర వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మచిలీపట్నానికి చెందిన అయ్యప్ప భక్తులు ఆటో డ్రైవర్‌ని దుర్భాషలాడారు. ఆగ్రహించిన ఆటోడ్రైవర్ దగ్గరలోని కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో బస్సు అద్దంపై దాడిచేశాడు. అద్దం ధ్వంసమవడంతో ఆ వాహన డ్రైవర్ విజయవాడకు చెందిన బస్సు యజమానికి ఫోన్‌ద్వారా విషయం తెలిపాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ అయ్యప్ప భక్తులు వెంటనే ఆటో డ్రైవర్‌పై దాడి చేశారు. బలవంతంగా బస్సులోకి తోశారు. అక్కడున్న స్థానికులు గమనించి బస్సును అడ్డుకున్నారు. అందుకువారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కె వెళ్లి ఫిర్యాదు చేస్తామని, నమ్మించి బస్సులో విజయవాడకు బయల్దేరారు. విషయాన్ని అప్పటికే కొందరు స్థానికులు 100కు ఫోన్‌చేసి.. పోలీసులకు తెలియజేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కూడా ఎంతసేపటికీ బస్సు పోలీస్‌స్టేషన్ వద్దకు రాకపోవడంతో వన్‌టౌన్ సీఐ అంజుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. బస్సు నెంబరు ద్వారా పోలీసులు సంబంధిత వాహన యజమాని వివరాలు గుర్తించి, ఫోన్లో సంప్రదించారు. 'ఆటో డ్రైవర్‌ను వదిలే ప్రసక్తే లేదు.. ఏం చేస్తారో చేసుకోండి. నేను అధికార పార్టీ నాయకుడిని' అంటూ ఆ యజమానికి పోలీసులకు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఆటోడ్రైవర్ సెల్‌ఫోన్ ఆధారంగా బస్సు.. పొదలకూరు వద్ద వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి ఆ బస్సును అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి పోలీసులు పొదలకూరు చేరుకుని, ధర్మేంద్రను విడిపించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం శనివారం వేకువజామున శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయ్యప్ప భక్తులతోసహా బస్సును శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు కాకుండా కొందరు అధికార పార్టీ నేతలు ఫోన్ల ద్వారా అధికారులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా 14మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి.. బస్సును ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీలో పెట్టారు.



చికిత్స పొందుతున్న ధర్మేంద్ర

మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలి

● మంత్రి బొత్స దిష్టిబొమ్మతో ఏబీవీపీ నిరసన ● దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

తిరుపతి(విద్య), జనవరి 6: రాష్ట్రంలో వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఏబీవీపీ కన్వీనర్ రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బీఈడీ, డీఈడీ, బీపీఈడీ అభ్యర్థులతో కలసి శనివారం తిరుపతిలోని బాలాజీకాలనీ సర్కిల్‌లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దిష్టిబొమ్మతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బొత్స ఇంక లేరు అన్న బ్యానర్‌నూ ప్రదర్శించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనానికి పూనుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లుగా నిరుద్యోగులు ఎంతో ఆశగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్‌ని విడుదల చేస్తామని మాటిచ్చిన సీఎం జగన్ ఇప్పటివరకు ఒక డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడం బాధాకరమని వాపోయారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీని విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పవన్‌కుమార్, అభ్యర్థులు పాల్గొన్నారు.



బొత్స దిష్టిబొమ్మతో ఏబీవీపీ నాయకులు, అభ్యర్థులు



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కాంగ్రెస్‌తోనే ప్రత్యేకహోదా సాధ్యం



నిరసన తెలుపుతున్న చింతామోహన్ తదితరులు

గూడూరు, జనవరి 6: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తామన్నారు. సీఎం జగన్ ఎన్నికల సమయంలో 20 మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెస్తానని నమ్మించి గెలిచిన తరువాత ప్రజలను మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల వైసీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు అందరూ సమ్మెబాట పట్టారన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ను అందోళన ప్రదేశ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, నెహేమ్యా, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి డిపాజిట్లు దక్కవు

వెంకటగిరిటౌన్, జనవరి 6: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవని మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ అన్నారు. శనివారం పట్టణంలో పర్యటించారు. పోలేరమ్మ ఆర్చి వద్ద ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతో సీఎం జగన్‌కు వణుకు పుట్టిందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనను తరిమికొడదాం: టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 6: రాష్ట్రంలో సీఎం జగన్ ఆధ్వర్యంలో సాగుతున్న సైకో పాలన ను తరిమికొడదామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కేశవరం పంచాయతీ రాఘవాపురంలో శనివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, నాయకులు మధుయాదవ్, చాపల శ్రీనివాసులు, పశుపులేటి వేణు, భూపతి, అనూక్, విష్ణు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థులకు అభినందన



సర్టిఫికెట్లతో విద్యార్థులు

గూడూరు, జనవరి 6: సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభచాటిన స్థానిక స్వర్ణాంధ్రభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. శనివారం కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ గత ఏడాది నవంబరులో జరిగిన సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలకు తమ పాఠశాల నుంచి 92 మంది విద్యార్థులు హాజరయ్యారని, శుక్రవారం విడుదలైన ఫలితాల్లో 14 మంది సెకండ్ లెవెల్‌కు అర్హత సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించామరు. కార్యక్రమంలో సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ



విద్యానగర్‌లో ర్యాలీ చేస్తున్న విశ్వహిందూపరిషత్ నాయకులు

కోట, జనవరి 6: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి అక్షతలను శనివారం మండల పరిధిలోని విద్యానగర్‌లో ఇంటింటా పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, రామభక్తులు జెండాలు చేతపట్టుకొని విద్యానగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అయోధ్య రామమందిర అక్షతలు, కరపత్రాలు, చిత్రపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకాటి కిషోర్, గురుదేవయ్య, కోటేశ్వరరావు రఘుచేతన్, పురుషోత్తం, సాద్విక్, దేవేంద్ర, కార్తీక్, చెందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండలంలోని మన్నారుపోలూరు, సాయినగర్ తదితర ప్రాంతాల్లో శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుంకర ప్రతిమ, యారాశి గోపి, ఉష, కృష్ణారెడ్డి, హేమంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో ప్రకృతి పంట మేళా

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 6: నేడు తిరుపతి నగరంలో ప్రకృతి పంట మేళాను నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు, రైతు కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్ లో మీడియాతో మాట్లాడుతూ రాస్ భవనం వెనుక ఉన్న యూత్ హాస్టల్ ప్రాంగణంలో మేళా జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులందరూ కలిసి కనెక్ట్ 2 ఫార్మా సహాయ సహకారాలతో తమ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. సేంద్రియ పంటమేళాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆదర్శ రైతులను ఆహ్వానించి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఉచితంగా శిక్షణ కూడా ఇస్తామన్నారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనడానికి ఇది మంచి అవకాశం అన్నారు. వివరాలకు 6303606326 నెంబరును సంప్రదించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులు మురళి, గోవర్ధన్‌నాయుడు, కుమార్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరికి గాయాలు

ఏర్పేడు, జనవరి 6: ఏర్పేడు నుంచి వెంకటగిరి వైపు వెళుతున్న ఆటోను వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు వస్తున్న లారీ నచ్చనేరి పంచాయతీ దుర్గపురి వద్ద ఢీకొంది. ఆటో డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌ది రేణిగుంట మండలం గురవరాజుపల్లి పంచాయతీ రామకృష్ణాపురం. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ అరాచకపాలనకు స్వస్తిపలకాలి

గూడూరు, జనవరి 6: వైసీపీ ప్రభుత్వం నాగున్నరేళ్ల నుంచి సాగిస్తున్న అరాచక పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వస్తి పలకాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శనివారం అన్నారు. రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని వీటిని, సరిచేయాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలన్నారు. మహాశక్తి, తల్లికి వందనం, దీపం పథకం, అన్నదాత, బీసీ రక్షణ చట్టం తదితర పథకాల ద్వారా అన్నివర్గాలకు న్యాయం చేకూరేలా మినీ మేనిఫెస్టో రూపొందించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పి టీడీపీని గెలిపించాలని తెలిపారు.

మండల పరిషత్ నిధుల ఆడిట్

కోట, జనవరి 6: కోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆడిట్ జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన నిధులు, వాటి వినియోగం, జమా ఖర్చులు తదితర అంశాలపై ఆడిట్ నిర్వహించారు. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ హిమబిందు, సీనియర్ ఆడిట్ ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, జనవరి 6: నాయుడుపేట - తిమ్మాజికండ్రిగ స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపంలో శనివారం రాత్రి తిమ్మాజికండ్రిగ గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ అక్రమంగా తరలిస్తున్న 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు.

17న శాంతియుత నిరాహార దీక్ష

గూడూరు, జనవరి 6: స్థానిక పాతబస్టాండు సమీపంలోని అంబేడ్కర్ భవనాన్ని అభివృద్ధి పరచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద శాంతియుత నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య శనివారం తెలిపారు.



నాయుడుపేటలో జీవో నెంబరు 2 ప్రతులను తగలబెడుతున్న అంగన్వాడీలు - సూళ్లూరుపేటలో దీక్ష

డిమాండ్లు పరిష్కరించమంటే బెదిరింపులా?

నాయుడుపేట టౌన్, జనవరి 6: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తుంటే విధులకు హాజరుకావాలని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమని అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ అన్నారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 2వ ప్రతులను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని 26 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం శనివారం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ జీవో ఇవ్వడం దుర్మార్గమన్నారు. సమ్మె చేపట్టిన నాటినుంచి అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ఇలాగే ఇబ్బందులు పెడితే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, అంగన్వాడీ సంఘ నాయకులు నాగమణి, కళావతి, సంధ్య, వాణి, చెంగమ్మ, బుజ్జమ్మ తదితరులు ఉన్నారు.

గూడూరు: అంగన్వాడీలు డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం మొండివైఖరిని వీడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 26వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్వాడీలు 26 రోజులుగా దీక్ష చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, రమణయ్య, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, చంద్రయ్య, పెంచలమ్మ, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

వెంకటగిరి: బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె శనివారం 26 వ రోజు కొనసాగింది. వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగే కొద్దీ ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములా బేగం, లక్ష్మి ప్రసన్నా తదితరులు ఉన్నారు.

కోట: రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కోటలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శనివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. తక్షణమే విధులకు హాజరుకావాలంటూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను అంగన్వాడీలు దీక్షా శిబిరం వద్ద తగులబెట్టారు. తమ డిమాంట్లను పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని తేల్చిచెప్పారు.

సూళ్లూరుపేట: ప్రభుత్వం కళ్లు తెరచిచూస్తే అంగన్వాడీల కష్టాలు తెలుస్తాయని ఆ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు వారాలుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా విధులకు హాజరుకాకపోతే చర్యలు తీసుకొంటామని బెదిరించడం సమంజసం కాదన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపకుండా బెదిరిస్తే భయపడబోమని, ఆదిపరాశక్తిలా విజృంభిస్తామన్నారు. తామేమీ కొత్తగా కోర్కెలు కోరవడం లేదని, సీఎం చెప్పిన హామీలను మాత్రమే నెరవేర్చమని అడగుతున్నామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. వీరికి సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అల్లెయ్య, చంద్రశేఖర్, రమణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు, వెంకటగిరిలో మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించి నిరసన తెలుపుతున్న కార్మికులు

సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం

గూడూరు, జనవరి 6: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు అన్నారు. శనివారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయ ముట్టడి నిర్వహించారు. గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ 12 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నా రాష్ట్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నామే గానీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం పోలీసులు అక్కడి నుంచి కార్మికులను పంపించేయడంతో దీక్షాశిబిరంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, రమేష్, కోటేశ్వరరావు, ప్రసాద్, పెంచలప్రసాద్, మురళి, రాఘవయ్య, ప్రభావతి, వరలక్ష్మి, పోలమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: తమ సమస్యలను పరిష్కరించాలని 12 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టిడించి నిరసన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అధికార పార్టీ నాయకులు సమ్మెలో ఉన్న కార్మికులను బెదిరిస్తున్నారని, ఇది మంచి పద్ధతికాదన్నారు. జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చపోతే తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సాంబశివయ్య రియాజ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం కొనసాగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సీఐటీయూ నేతలు వడ్డిపల్లి చెంగయ్య, సుబ్బయ్య, ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు కల్లూరి జాన్, బాలాజా, రాజేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

నాయుడుపేట టౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం సబబుకాదన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలపై ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, కార్మిక సంఘ నాయకులు వెంకటరత్నం, మస్తానయ్య, శీనయ్య, మహాలక్ష్మమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అన్వర్‌బాషా

తిరుపతి(లీగల్), జనవరి 6: కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.అన్వర్‌బాషా కోరారు. శనివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ, హిందూ సక్సెసన్ యాక్ట్ గురించి న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి అన్వర్‌బాషా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. 10వ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ఏపీ బార్ కౌన్సిల్ మెంబరు గల్లా సుదర్శనరావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి జె.దేవరాజులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.గోపీచంద్, సీనియర్ న్యాయవాదులు మనోహర్, నాగరాజు, నరహరిరెడ్డి, విజయకుమార్, ఉదయ్‌కుమార్, చల్లా వెంకటయ్య, మావిళ్ల హరీష్, రాజశేఖర్, నెల్లూరు యోగానంద్, సుబ్రహ్మణ్యం, వేమారత్నం, ఆశాఅమీర్‌బీ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనంబి చెంతకు మలయప్పస్వామి

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం తిరుమలనంబి ఆలయం వద్దకు వేంచేపు చేశారు. ఏటా తన్నీరు ముదు ఉత్సవం మరుసటి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తిరుమలనంబికి మేల్‌చాట్ శేషవస్త్రాన్ని సమర్పించారు. శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, శ్రీవారి సేవలో తన జీవితాన్ని అర్పించిన తిరుమలనంబి సాక్షాత్తు రామానుజాచార్యులకు మేనమామ. ఈ కార్యక్రమంలో తిరుమల జీయర్‌స్వాములు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

ఊంజల్‌పై పద్మావతీదేవి అభయం

తిరుచానూరు, జనవరి 6: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు శనివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలో ఊంజల్‌పై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ధనుర్మాసం పూజల అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం కేటీ మండపంలో కల్యాణోత్సవం నయనానందకరంగా సాగింది. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారికి వాహన మండపంలో వేడుకగా ఊంజల్‌సేవ జరిగింది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తిరుప్పావడ సేవ



వెంకటగిరిటౌన్, జనవరి 6: పట్టణంలోని కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి శనివారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. పులిహోర, నిప్పటి, కజ్జికాయలు, మైసూరు పాక్, పప్పుబిళ్లలు, తులసిమాల, పూలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనార్థం కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులడు మణికంఠ స్వామి పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుపై చైన్ స్నాచర్ల దాడి

శ్రీకాళహస్తి జనవరి 6: స్టాఫ్ నర్సు మెడలోని గొలుసు చోరీ చేసేందుకు ఇద్దరు చైన్ స్నాచర్లు విఫలయత్నం చేశారు. ఆమె ప్రతిఘటించడంతో పరారయ్యారు. తొట్టంబేడు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన నీరజ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. శనివారం నైట్ డ్యూటీ కోసం ద్విచక్ర వాహనంపై పీహెచ్‌సీ వద్దకు వచ్చింది. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై హెల్మెట్లు ధరించిన ఇద్దరు దుండగులు వచ్చారు. హఠాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. ఆమె వారిని ప్రతిఘటిస్తూ గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. సహచర సిబ్బంది ఆమెకు చికిత్స అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెళ్లకూరు, జనవరి 6: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు సుజాతమ్మ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వాతావరణం ఒక్కసారిగా చల్లపడటంతో జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. నీటి నిల్వలు లేకుండా శుభ్రతను పాటించడంతో పాటు ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని సూచించారు. జ్వరం వస్తే చికిత్స చేయించుకుని తగిన విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జనవరి 6: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ జరిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మాదిగ సభను జయప్రదం చేయండి

వెంకటగిరి టౌన్, జనవరి 6: కడప మున్సిపల్ మైదానంలో ఈ నెల 20న ఏపీ ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉప కులాల రాజకీయ సమన్యాయ మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి యలపల్లి శ్రీనివాసులు శనివారం తెలిపారు.

గోవిందరాజస్వామి ఆలయంలో
14 నుంచి సంక్రాంతి వేడుకలు

తిరుపతి (కల్చరల్), జనవరి 6: గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 14న భోగితేరు, 15న మకరసంక్రాంతి, 16న గోదాకల్యాణం నిర్వహిస్తారని పేర్కొంది. కాగా భోగి రోజున సాయంత్రం ఆండాల్ అమ్మవారు, కృష్ణస్వామిని భోగి తేరుపై ఊరేగిస్తారని, 15న ఉదయం సంక్రాంతి తిరుమంజనం నిర్వహిస్తారని తెలిపింది. ఉదయం 6.30గంటలకు కపిలతీర్థంలో చక్రస్నానం, ఆస్థానం ఉంటాయని, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజస్వామి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపింది. 17వ తేదీ పార్వేట ఉత్సవం ఉంటుందని వెల్లడించింది.

టీడీపీతోనే బీసీలకు భవిష్యత్
జయహో బీసీ చైతన్య రథాలు ప్రారంభం



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీసీలను చైతన్యపరచడానికి ఏర్పాటుచేసిన రెండు చైతన్య రథాలను శనివారం రేణిగుంట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ బీసీల కష్టాలను తెలుసుకుని, తగిన విధంగా అజెండా రూపొందించుకుని ప్రభుత్వపరంగా రాబోయే రోజుల్లో తగిన సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో బీసీ జయహో రథాలను ప్రారంభించామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను అన్ని విధాలుగా ఆదుకున్నామని, జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వవైభవం రావాలంటే అందరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, రుద్రకోటి సదాశివం, రెడ్డివారి గురవారెడ్డి, పుష్పావతి, కరాటే చంద్ర, మునస్వామి యాదవ్, మనోహరాచారి, జగన్నాథం, తులసీదాస్, రాజయ్య, శంకర్, అశోక్, గంధం బాబు, శ్రీనివాసులు, విశ్వనాథం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ముంచేసిన జగన్: తెలుగు యువత

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 6: బూటకపు మాటలతో రాష్ట్రంలోని నిరుద్యోగులను సీఎం జగన్ నిలువునా ముంచేశాడని, రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపడం ఖాయమని తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక కొత్త పరిశ్రమలు రాక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కల్తీమద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు వి క్రయిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో 21,575మంది యువత ఆత్మహత్య చేసుకున్నారని పార్లమెంటు సాక్షిగా కేంద్ర వెల్లడించిందన్నారు. అలాగే రాష్ట్రంలో మత్తు పదార్థాలకు బానిసలై 2021లో 571మంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్‌సీఆర్‌సీ నివేదిక వెల్లడించిందన తెలిపారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో పరిశ్రమల ద్వారా 5,13,351మందికి ఉద్యోగాలు వచ్చినట్లు అసెంబ్లీ సాక్షిగా మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వెల్లడించారన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు విద్యార్థులు, యువత సిద్ధంగా ఉందన్నారు.